

## యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి హుస్నాబాద్ ఏసిపి సదానందం

**విశ్వంభర, హుస్నాబాద్:** అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా హుస్నాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో హుస్నాబాద్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హుస్నాబాద్ ఏసీపీ ఎస్. సదానందం నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్, ఎస్సై లక్ష్మారెడ్డి పాల్గొని ప్రజలకు మాదకద్రవ్యాల వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసిపి ఎస్. సదానందం మాట్లాడుతూ, యువత, విద్యార్థులు మాదకద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండి క్రమశిక్షణతో చదువుకొని తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని సూచించారు. డ్రగ్స్ వినియోగం వ్యక్తిగత జీవితానికే కాకుండా కుటుంబం, సమాజంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందని అన్నారు. మాదకద్రవ్యాలకు సంబంధించిన అనుమానాస్పద కార్యకలాపాలు ఎక్కడైనా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించి సమాజాన్ని రక్షించడంలో భాగస్వాములు కావాలని ప్రజలను కోరారు. అనంతరం "డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరం కృషి చేస్తాం" అంటూ హాజరైన వారందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ చిత్తారి పద్మ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వెన్న రాజు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వి. వెంకట రమణ, ట్రాఫిక్ ఎస్సై వెంకటేశ్వర్లు, మున్సిపల్ కౌన్సిలర్లు, సివిల్, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది, పట్టణ ప్రముఖులు, యువకులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## కురుమ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి : జబ్బల శ్రీనివాసులు



**విశ్వంభర, బషీర్ బాగ్ :** తెలంగాణలో కురుమ కార్పొరేషన్ ను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయాలని సౌత్ ఇండియా కురుబ, కురుమ, కుటుంబన్, కురువం, దంగర్ సంఘం అధ్యక్షుడు జబ్బల శ్రీనివాసులు కోరారు. శుక్రవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అధికార ప్రతినిధి కె.వి చలపతి కలిసి అధ్యక్షుడు జబ్బల శ్రీనివాసులు మాట్లాడుతూ జూలై 12న తిరుపతి జిల్లా, తిరుపతి పట్టణంలోని లీలా మహల్ జంక్షన్ దగ్గర దక్షిణాది రాష్ట్రాలకు చెందిన కురుమ నేతలతో సమావేశం నిర్వహిస్తున్నామని చెప్పారు. ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల ప్రభుత్వంలో కురుమలు మంత్రులుగా ఉన్నారని తెలిపారు. తెలంగాణ లోని కాంగ్రెస్ ప్రభుత్వం మంత్రివర్గంలో కురుమలు మంత్రులుగా లేకపోవడం బాధాకరమన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో కేబి నరసప్ప, రామచంద్రారెడ్డి మంత్రులుగా పనిచేశారని తెలిపారు. 30 లక్షలకు పైగా జనాభా ఉన్న రాజకీయ చైతన్యం లేకపోవడం విచారకరమన్నారు. కురుమ సంఘం నేతలంతా ఐక్యంగా ఉండి రాజ్యాధికారంలో భాగస్వాములు కావాలని వారు పిలుపునిచ్చారు. ఉభయ రాష్ట్రాలలో 60 లక్షల మంది పైగా ఉన్న కురుబ, కురుమ కుల జనాభాకు రాజ్యసభ ఎమ్మెల్సీలుగా నియమించకపోవడం బాధాకరమన్నారు.

## కొండా మురళీధర్ రావును కలిసిన చిప్ప వెంకటేశ్వర్లు



**విశ్వంభర, హనుమకొండ :** ఇటీవల మట్వాడా కొత్తవాడ చేనేత చత్రంగి సహకార సంఘం లిమిటెడ్ ఎన్నికలలో టిపిసిసి చేనేత విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్ప వెంకటేశ్వర్లు బలపరిచిన ప్యానల్ అభ్యర్థులు అధ్యక్షుడుగా దుబాల రాజేందర్ ఘనవిజయం సాధించిన సందర్భంగా శుక్రవారం హనుమకొండ రాంనగర్ లోని కొండా దంపతుల నివాసంలో మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావుని చిప్ప వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి బుకే ఇచ్చి శాలువలతో సన్మానించి వారి ఆశీర్వాదం తీసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ కొండా మురళిదర్ రావు మాట్లాడుతూ, మంత్రి కొండా సురేఖ సహకారంతో చేనేత కార్మికులకు ఏ ఆపద వచ్చిన ముందుండి వారి సంక్షేమం కోసం పాటు పడతామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి పథకాలు వచ్చిన ఎన్ని నిధులైన అందించడానికి రాష్ట్ర మంత్రి కొండా సురేఖ అండదండలు ఉంటాయని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళిదర్ రావు తెలిపారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు దుబాల రాజేందర్ మీడియాతో మాట్లాడుతూ మంత్రి కొండా సురేఖ, మురళీధర్ రావు దంపతుల సహాయ సహకారాలతో కొత్తవాడ చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు దుబాల రాజేందర్, ఉపాధ్యక్షులు కూచన ఓదెలు, కోశాధికారి మేరుగు లింగమూర్తి, కార్యదర్శి మండల శంకర్, కార్యవర్గ సభ్యురాలు ఆడెపు రాధ, స్టాఫ్ ఇంచార్జి బైరి మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

## వివాహ వేడుకల్లో పాల్గొన్న బోగారం సర్పంచ్

**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలం, బోగారం గ్రామానికి చెందిన గుంతకంట్ల సంజీవరెడ్డి - అండాలు దంపతుల చిన్న కుమారుడు గుంతకండ్ల శ్రీనివాస్ రెడ్డి- సుస్మిత ల వివాహ రిసెప్షన్ లో బోగారం గ్రామ సర్పంచ్ సాయికుమార్ గౌడ్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ వివాహ రిసెప్షన్ కి ఇంద్రపాలనగరం గ్రామ సర్పంచ్ గర్దాస్ విక్రమ్ కూడా హాజరయ్యారు.



## తాత్కాలిక ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి: వెంకటేశ్వర్ రెడ్డి



**విశ్వంభర, హైదరాబాదు :** గ్రామీణ బ్యాంకుల్లో ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న తాత్కాలిక ఉద్యోగులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని, దేశవ్యాప్తంగా ఉన్న గ్రామీణ బ్యాంకులను ఏకీకృతం చేసి ఒకే జాతీయ గ్రామీణ బ్యాంకును ఏర్పాటు చేయాలని ఆల్ ఇండియా రీజనల్ రూరల్ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎస్. వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. హైదరాబాదు బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఉద్యోగుల సంఘం తొలి జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గ్రామీణ బ్యాంకుల్లో ఉద్యోగుల పదోన్నతుల విషయంలో స్పాన్సర్ బ్యాంకుల్లో అమలవుతున్న విధానాన్నే గ్రామీణ బ్యాంకుల్లో కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల సంక్షేమం, సేవా భద్రతకు ప్రాధాన్యం కల్పిస్తూ తాత్కాలిక ఉద్యోగులను శాశ్వతీకరించాలని కోరారు. తెలంగాణ గ్రామీణ బ్యాంకు చైర్మన్ కె. ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ, ఉద్యోగులు బ్యాంకు అభివృద్ధికి కీలక భూమిక పోషిస్తున్నారని, నూతన కార్యవర్గం ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో సమర్థంగా పనిచేయాలని ఆకాంక్షించారు. ఆల్ ఇండియా రీజనల్ రూరల్ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు సి. రాజీవన్ మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా గ్రామీణ బ్యాంకు ఉద్యోగుల హక్కుల పరిరక్షణకు సంఘటిత పోరాటం అవసరమని అన్నారు. నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ రీజినల్ రూరల్ బ్యాంక్ ఎంప్లాయీస్ అధ్యక్షుడు వై. యశ్వంత్ మాట్లాడుతూ, గ్రామీణ బ్యాంకు ఉద్యోగుల సేవా నిబంధనలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆ సంస్థ జనరల్ సెక్రటరీ సమీరం మేది మాట్లాడుతూ, ఉద్యోగుల సంక్షేమం, పదోన్నతులు, సేవా భద్రత అంశాలపై దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పి. వేణు రావు, ప్రధాన కార్యదర్శిగా ఆకుల బాపు, కోశాధికారిగా టి. సతీష్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో: పి. వేణు రావు అధ్యక్షుడు ఆకుల బాపు ప్రధాన కార్యదర్శి టి. సతీష్ కోశాధికారి, 700 మందికి పైగా సభ్యులు పాల్గొన్నారు.

## జూలై 2న 'చలో హైదరాబాద్'కు తెలంగాణ రక్షణ సేన పిలుపు



### ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలాల కోసం భూ పోరాటం: నేతలు

**విశ్వంభర, మహబూబాబాద్:** తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు, ముఖ్యంగా 250 గజాల ఇంటి స్థలాల కేటాయింపు కోసం జూలై 2న హైదరాబాద్‌లోని ఉప్పల్ బాగాయత్‌లో నిర్వహించే 'చలో హైదరాబాద్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ రక్షణ సేన నాయకులు పిలుపునిచ్చారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని అమరవీరుల స్థూపం వద్ద శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో టీఆర్ఎస్ తెలంగాణ రక్షణ సేన పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి గొంగళ్ల రంజిత్ కుమార్, మలిదశ తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపకులు సామ అంజారెడ్డి మాట్లాడారు. పార్టీ వ్యవస్థాపకురాలు కల్వకుంట్ల కవిత పిలుపు మేరకు ఉద్యమకారుల హక్కుల సాధన, గుర్తింపు కోసం మరో భూ పోరాటానికి సిద్ధం కావాలని వారు కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే తెలంగాణ ఉద్యమకారులకు ఒక్కొక్కరికి 250 గజాల ఇంటి స్థలం, నెలకు రూ.25 వేల పింఛన్ అందిస్తామని హామీ ఇచ్చిందని, అయితే ఇప్పటివరకు ఆ హామీలు అమలు కాలేదని విమర్శించారు. ఉద్యమకారుల సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ఈ పోరాటానికి పార్టీలకతీతంగా తెలంగాణ ఉద్యమకారులు, ఉద్యమకారుల సంఘాలు, వివిధ కుల సంఘాలు, ప్రజా సంఘాలు, ప్రజలు పెద్ద ఎత్తున మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. జూలై 2న ఉప్పల్ బాగాయత్‌లో జరిగే భూ పోరాటాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు బోర్రాజు లింగన్న, ముస్లిం జేఏసీ రాష్ట్ర కన్వీనర్ మహమ్మద్ అహ్మద్ ఖాన్, పుచ్చకాయల రామకృష్ణ, వీరబోయిన నరేష్, కొత్తగట్టు యాకయ్య, పెరుమళ్ల రాజేష్, గంధసిరి వేణు, చిలకల రాజేష్, దేశగాని కృష్ణ, ఆంగోత్ చందులాల్, దొంతు శ్రావణ్, దుర్గా ప్రసాద్ తదితర ఉద్యమకారులు పాల్గొన్నారు.

## తెలంగాణ మేరు కుల ప్రభుత్వ ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటు

### ఉద్యోగుల హక్కుల సాధనకు సంఘం కీలకం: సంఘ వెంకట రాజం



**విశ్వంభర, బషీర్‌బాగ్:** మేరు కుల ప్రభుత్వ ఉద్యోగుల పదోన్నతులు, బదిలీలు, పదవీ విరమణ భత్యాలు, ఇతర సేవా సంబంధిత సమస్యల పరిష్కారంతో పాటు ఉద్యోగుల హక్కుల పరిరక్షణ కోసం తెలంగాణ రాష్ట్ర మేరు కుల ప్రభుత్వ ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్‌ను ఏర్పాటు చేసినట్లు మేరు కార్పొరేషన్ చైర్మన్ సంఘ వెంకట రాజం తెలిపారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో వైస్ చైర్మన్ మాడిశెట్టి లక్ష్మీనారాయణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంఘ వెంకట రాజం మాట్లాడుతూ మేరు కుల ప్రభుత్వ ఉద్యోగులంతా ఐక్యంగా ఉండి తమ హక్కుల సాధన కోసం సంఘటితంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. మేరు కుటుంబాల సమగ్ర వివరాల సేకరణ కోసం రూపొందించిన నూతన వెబ్‌సైట్‌ను రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించడం సంతోషకరమని పేర్కొన్నారు. ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ భావితరాలకు బలమైన వేదికగా నిలవాలని ఆకాంక్షించారు. సమావేశంలో అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులుగా మారిశెట్టి నవీన్ కుమార్, రుద్రంగి రమేష్, కొత్తకొండ సుజాత, ఓడపల్లి ప్రసూనరాణి, గూడూరు కిరణ్, ఓదెల నరేందర్, బుర్ర సాయిబాబా, కొక్కు వినోద్, రాపర్తి వినోద్, రామగిరి సుదర్శన్, మాడిశెట్టి వివేకానంద, సాంబ శ్రీనాథ్, గుంటి సాయిచరణ్, గట్ల ఆదిత్య, నోముల జగదీష్, ఓడపల్లి మనీష్, ఆదిమూలం శ్రీనివాస్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి అదనపు కమిషనర్ కీర్తి వేణుగోపాల్, ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ లీగల్ అడ్వైజర్ కొండ మోహన్, మాడిశెట్టి మోహన్, గూడూరు కిరణ్, కోడెల నరేందర్, ఆదిమూలం దిలీప్ కిషన్, కొత్తకొండ సుజాత, మునగాల రమేష్, సింగు విష్ణు, వాడపల్లి మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో ఉండాలి

### రైతు ఆత్మ కమిటీ చైర్మన్ జంగపల్లి ఐలయ్య



**విశ్వంభర, హుస్నాబాద్ :** అక్కన్నపేట మండలం నందారం గ్రామంలో భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమం శుక్రవారం విస్తృతంగా నిర్వహించారు. బూత్ స్థాయి అధికారి బానోతు రమ ఆధ్వర్యంలో ఇంటింటి ఎన్యుమరేషన్ చేపట్టి, ఓటర్ల వివరాలను సేకరించడంతో పాటు ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేసి, నిర్ణీత గడువులోపు వాటిని సమర్పించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆత్మ కమిటీ చైర్మన్ జంగపల్లి ఐలయ్య మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, 18 సంవత్సరాలు నిండిన ప్రతి అర్హుడి పేరు తప్పనిసరిగా ఓటరు జాబితాలో నమోదు కావాలని పిలుపునిచ్చారు. కొత్త ఓటర్లు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, మరణించిన వారు లేదా శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారి పేర్ల తొలగింపునకు కూడా ప్రజలు సహకరించాలని కోరారు. ఓటరు జాబితాలో పేరు, చిరునామా, వయస్సు లేదా ఇతర వివరాల్లో ఏవైనా పొరపాట్లు ఉంటే ఈ ప్రత్యేక సవరణలో సరిదిద్దుకునే అవకాశం ఉందని తెలిపారు. స్వచ్ఛమైన, పారదర్శకమైన ఓటరు జాబితా తయారీలో ప్రతి కుటుంబం ఎన్నికల సిబ్బందికి సహకరించి అవసరమైన పత్రాలను సమర్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బానోతు భాస్కర్ నాయక్, కాంగ్రెస్ నాయకులు వంగపల్లి రాజు, లింగాల రాజు, గ్రామస్తులు బసిరెడ్డి సంజీవరెడ్డి, రాకేష్ రెడ్డి, పెరుక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## నూతన వధూవరులను ఆశీర్వదించిన సత్యవతి రాథోడ్

**విశ్వంభర, కురవి:** మహబూబాబాద్ జిల్లా కురవి మండలం చీమలతండ గ్రామ పరిధిలోని భాగ్యతండాకు చెందిన భూక్య లింగ నాయక్ కుమారుడి వివాహ వేడుకలో మాజీ మంత్రివర్యులు సత్యవతి రాథోడ్ పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. వారి దాంపత్య జీవితం ఆనందంగా, ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో కొనసాగాలని ఆకాంక్షించారు. అనంతరం మండలంలోని నల్లెల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు బండి దీపక్ గౌడ్ కుమారుడి పుట్టినరోజు వేడుకలో పాల్గొని చిన్నారిని ఆశీర్వదించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా చీమలతండకు చెందిన మాజీ ఎంపీటీసీ భూక్య రామోజీని కలిసి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకొని ఆప్యాయంగా పరామర్శించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ధారావత్ సంకు రాధాకృష్ణ, మాలోత్ రమేష్, బానోతు మల్సూర్, బోడ శ్రీను నాయక్, గుగులోత్ నెహ్రూ నాయక్, మాజీ సర్పంచ్ గుండెబోయిన సూరయ్య, మాజీ సర్పంచ్ భూక్య మంగీలాల్, మాజీ ఎంపీటీసీ పోతుగంటి వెంకన్న, భూక్య రామోజీ, భానోత్ శ్రీరామ్, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

## రామారం గ్రామ కాంగ్రెస్ నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవం



**విశ్వంభర, గుండాల :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గంలోని గుండాల మండలం రామారం గ్రామంలో భారత జాతీయ కాంగ్రెస్ (ఐఎన్‌సీ) గ్రామశాఖ నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఆదేశాల మేరకు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఇమ్మడి దశరథ గుప్తా ఆధ్వర్యంలో ఈ కమిటీని ప్రకటించారు. గ్రామశాఖ అధ్యక్షుడిగా బబ్బూరి భాస్కర్, ఉపాధ్యక్షులుగా మల్లెపాక మహేష్, బోయిని శ్రీను, ప్రధాన కార్యదర్శిగా చంద్రగిరి పురుషోత్తం, కార్యదర్శులుగా అందెం వెంకట్ రెడ్డి, మల్లెపాక పరుశరాములు ఎంపికయ్యారు. యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా కల్వల సురేష్, ఉపాధ్యక్షులుగా ఎదునూరి యాకన్నా, మల్లెపాక పవన్, ప్రధాన కార్యదర్శిగా బెల్లంకొండ పవన్ నియమితులయ్యారు. ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా మల్లెపాక నర్సింహ, ఉపాధ్యక్షుడిగా మల్లెపాక పరుశరామ్, బీసీ సెల్ అధ్యక్షుడిగా మంద మత్స్యగిరి, సోషల్ మీడియా కన్వీనర్‌గా బెల్లంకొండ బాబు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఇమ్మడి దశరథ గుప్తా మాట్లాడుతూ, నూతన కమిటీ సభ్యులు కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేస్తూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేసి, పార్టీని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

## వర్షాకాలంలో గ్రామస్తులు ఇబ్బంది పడొద్దు : సర్పంచ్ దేవేందర్ నాయక్



**విశ్వంభర, మహేశ్వరం :** మహేశ్వరం మండలం గ్రామపంచాయతీ పరిధిలో మహేశ్వరం గ్రామం నుండి గంగారం వరకు చెట్ల పొదలు తొలగించి, రోడ్డు ఇరువైపులా మట్టి పోయించి వెడల్పు చేయడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ దేవేందర్ నాయక్ మాట్లాడుతూ, గ్రామ పంచాయతీ ని అభివృద్ధి చేయడమే లక్ష్యం అని గత పాలకులు పరిపాలించిన గంగారం గ్రామపంచాయతీకి అభివృద్ధి శూన్యం, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రేవంత్ రెడ్డి సీఎం అడుగుజాడల్లో గ్రామాలు అభివృద్ధి చెందుతుతోందని అన్నారు. వర్షాకాలం ఇబ్బంది పడకుండా సౌకర్యమైన రోడ్లు ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు . ఈ కార్యక్రమంలోవార్డ్ మెంబర్స్ ఎం రవి, కే రాజు, ఎం గోపి, ఏం శ్రీనివాస్, ఏం భాస్కర్, బిచ్చ నాయక్, రాజా తదితులు పాల్గొన్నారు.

## పెళ్ళింట్లో చోరీ..కేటరింగ్ కోసం వచ్చిన వారే దొంగలు రూ.71 వేలు రికవరీ.. ఒకరికి రిమాండ్

**విశ్వంభర, నెల్లికుదురు:** పెళ్లి ఇంట్లో కట్నాలకు వచ్చిన డబ్బులు అపహరణకు గురైన కేసులో పోలీసులు 24 గంటల్లో చోరీ కేసు ఛేదించి రూ.71 వేలు రికవరీ చేసి ఒకరిని రిమాండ్ కు పంపిన సంఘటన మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలంలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై చిర్రా రమేష్ బాబు శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని హేమ్లా తండా జిపి శివారు బోడియా తండాకు చెందిన బానోతు బాలు కూతురు వివాహం జరిగింది. బంధువులు రూ.76 వేలు కట్నాలు రూపంలో సమర్పించారు. వీటిని ఇంట్లో ఉన్న బీరువాలో ఉంచి తాళం వేసి తాళం చెవి ని తన మొల్దారానికి కట్టుకొని రాత్రి నిద్రపోయాడు. గుర్తు తెలియని వ్యక్తులు మొల దారానికి ఉన్న బీరువా తాళం చెవిని తీసుకొని బీరువా తాళం తీసి అందులో ఉన్న రూ.76,000 నగదును అపహరించారు. దీంతో ఈనెల 25న బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్సై చిర్ర రమేష్ బాబు కేసు నమోదు చేసుకొని 24 గం.ల్లో చోరీ కేసును ఛేదించారు. పెళ్లి లో కేటరింగ్ పని కోసం వచ్చిన ఇద్దరు వ్యక్తులు చిన్నగూడూరు మండలం తుమ్మలచెరువు తండాకు చెందిన బానోతు భాస్కర్, హేమ్లతండ శివారు బోడియా తండా కు చెందిన భానోత్ వినోద్ దొంగతనానికి పాల్పడినట్లు గుర్తించారు. భాస్కర్ ను పట్టుకొని రూ.71 వేల నగదును రికవరీ చేసి నిందితుని కోర్టు ముందు రిమాండ్ కోసం హాజరు పరిచి జైలుకు పంపించినట్లు తెలిపారు. వినోద్ పరారీలో ఉన్నట్లు ఎస్సై తెలిపారు.





## క్రమశిక్షణ, సరైన మార్గదర్శకత్వం విజయానికి మూలం

### - మాజీ ఐపీఎస్ అధికారి జేడీ లక్ష్మీనారాయణ

### - సూర్యాపేటలో 'రెసోనెన్స్ ఫౌండేషన్ సెంటర్' ప్రారంభం

విశ్వంభర, సూర్యాపేట: క్రమశిక్షణ, సరైన మార్గదర్శకత్వం విజయానికి మూలమని మాజీ ఐపీఎస్ అధికారి జేడీ లక్ష్మీనారాయణ తెలిపారు. దేశంలో ఐఐటీ–జేఈఈ, నీట్ శిక్షణలో అగ్రగామిగా ఉన్న రెసోనెన్స్ విద్యాసంస్థలు సూర్యాపేటలో ఉన్న హోటల్ శ్రీ గ్రాండ్ వేదికగా 'రెసోనెన్స్ ఫౌండేషన్ సెంటర్'ను ప్రారంభించింది. మాజీ ఐపీఎస్ అధికారి జేడీ లక్ష్మీనారాయణ ముఖ్య అతిథిగా హాజరై ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే బలమైన విద్యా పునాది నిర్మించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సూర్యాపేటలో ఫౌండేషన్ కోచింగ్‌ను అందుబాటులోకి తీసుకు వస్తున్న రెసోనెన్స్ విద్యా సంస్థలను అభినందించారు. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. క్రమశిక్షణతో కూడిన అభ్యాసం, స్పష్టమైన అవగాహన, సరైన మార్గదర్శకత్వం విద్యార్థుల భవిష్యత్తు విజయాలకు కీలకమన్నారు. విద్యార్థులు చిన్న వయస్సులోనే క్రమబద్ధమైన విద్యా శిక్షణ ద్వారా భవిష్యత్తు పోటీ పరీక్షలకు బలమైన పునాదిని ఏర్పరచుకోవచ్చని తెలిపారు. ఈ ఫౌండేషన్ కోర్సు ద్వారా విద్యార్థులకు వివిధ అంశాలలో సమగ్ర శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. ప్రారంభ దశలోనే బలమైన పట్టు సాధించడం ద్వారా విద్యార్థులు భావనాత్మక అవగాహన, విశ్లేషణాత్మక ఆలోచన, సమస్యల పరిష్కార నైపుణ్యాలను పెంపొందించుకోగలరని చెప్పారు. దీంతో ఇంటర్ అనంతరం ఐఐటీ–జేఈఈ, నీట్ వంటి పోటీ ప్రవేశ పరీక్షలలో సులభంగా విజయం సాధించవచ్చని పేర్కొన్నారు'. ఈ సందర్భంగా రెసోనెన్స్ మేనేజింగ్ డైరెక్టర్ పూర్ణచంద్రరావు నర్రా మాట్లాడుతూ 'అనుభవజ్ఞులైన అధ్యాపకులు, క్రమబద్ధమైన బోధనా పద్ధతులు, నిరంతర విద్యా పర్యవేక్షణతో ఫలితాల ఆధారిత విద్యను అందించడానికి రెసోనెన్స్ కట్టుబడి ఉందన్నారు. ఈ ఫౌండేషన్ సెంటర్ విద్యార్థులకు ప్రాథమికాంశాలను బలోపేతం చేసుకోవడానికి, ఐఐటీ–జేఈఈ, నీట్, ఒలింపియాడ్స్ వంటి పోటీ పరీక్షలకు ఆత్మవిశ్వాసంతో సిద్ధమవడానికి సహాయపడుతుందని తెలిపారు. అనంతరం నిర్వహించిన అవగాహన సదస్సులో ప్రారంభ దశలోనే ప్రిపరేషన్ మొదలుపెట్టడం, సంపూర్ణ అవగాహనతో కూడిన అభ్యాసం, కెరీర్ ఆధారిత విద్యా ప్రణాళిక ప్రాముఖ్యతను వివరించారు'.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన టీఎన్జీవోస్ నేత రాజ్ కుమార్



విశ్వంభర, బషీర్ బాగ్ : చీఫ్ రేషనింగ్ ఆఫీసర్ కె.సత్యం కుమారుడు అరుణ్ కుమార్, హేమలత ల వివాహ రిసెప్షన్ బంగారు సౌదమ్మ ఆలయంలో వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా టీఎన్జీవోస్ యూనియన్ అసోసియేట్ ప్రెసిడెంట్ కె.ఆర్. రాజ్‌కుమార్ వధూవరులకు పుష్పగుచ్ఛం అందజేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో శంకర్, సత్యనారాయణ,చెన్నేశ్వర్(రాజు), రాంనాథ్, ఎల్ వెంకటేష్, బి శివరాజు, టి. విజయ్ కుమార్, వై చంద్రశేఖర్, పి అనిల్ కుమార్, సురేష్, రమేష్, రాజు పాల్గొన్నారు.

## రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలి

### బిజెపి నాయకులు నానవాలా కుమార్ యాదవ్



విశ్వంభర, శంషాబాద్: శంషాబాద్ నుండి షాబాద్ వెళ్లే రహదారి పనులు త్వరగా పూర్తిచేయాలని ఓబీసీ మోర్చా కిసాన్ ప్రధాన కార్యదర్శి నానవాలా కుమార్ యాదవ్ అన్నారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండల పరిధిలోని నర్కుడ గ్రామం వద్ద శంషాబాద్ నుండి షాబాద్ వెళ్లే రహదారిపై నానవాళ్ళ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో పార్టీలకతీతంగా గ్రామస్తులు పెద్ద ఎత్తున రోడ్డుపై బైఠాయించి ధర్నా చేపట్టారు. శంషాబాద్ నుండి షాబాద్ రోడ్డు రెండు లైన్ల నుండి నాలుగు లైన్ల రోడ్డుగా 2024 సంవత్సరంలో రోడ్డును స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ శంకుస్థాపన చేయడం జరిగింది. అయితే ఈ రెండు సంవత్సరాల కాలంలో రోడ్డు పనులు ప్రారంభించి కొంత భాగం పూర్తి చేసి మరి కొంత భాగం వదిలివేయగా గ్రామస్తులు తీవ్ర సమస్యకు గురవుతున్నారు. శుక్రవారం ఉదయం శంషాబాద్ నుండి శంషాబాద్ వెళ్లే రోడ్డుపై వెళ్తున్న వాహనాలను అడ్డగించి వాహనాలకు అడ్డంగా బయటాయించారు. ఈ రోడ్డులో ఎన్ని ప్రమాదాలు జరుగుతున్న స్థానిక ఎమ్మెల్యేకు ఈ రోడ్డు దుస్థితి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. పోలీసులు రంగప్రవేశం చేసి రోడ్డుపై బైఠాయించిన వారిని ప్రక్కకు జరిపి ట్రాఫిక్ క్లియర్ చేశారు. ఈ సందర్భంగా నానవాలా కుమార్ యాదవ్ మాట్లాడుతూ... రోడ్డు పనులను మధ్యలో ఆపడం వలన దీని ద్వారా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రభుత్వం వీలైనంత త్వరగా రోడ్డును పూర్తి చేయాలని ఇది ఒక నర్కుడ గ్రామ సమస్య మాత్రమే కాదని శంషాబాద్ నుండి షాబాద్ వరకు వెళుతున్న ప్రతి ఒక్కరి సమస్య అన్నారు. ఇప్పటికైనా స్పందించి వెంటనే అసంతృప్తిగా ఉన్న రోడ్డును పూర్తి చేయాలని అన్నారు. ఈ ధర్నా కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి సతీష్, నాగేష్, పులిమామిడి శ్రీకాంత్ గౌడ్, కుమార్ యాదవ్, అలాగే వివిధ పార్టీలకు చెందిన నాయకులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.ం

## ట్రాక్టర్ ఇనుప చక్రం మీద పడి చిన్నారి మృతి

విశ్వంభర, ఇబ్రహీంపట్నం : ట్రాక్టర్ ఇనుప చక్రం మీద పడి చిన్నారి మృతి చెందిన సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం, తులేకలాన్ గ్రామనికి చెందిన జక్కల లింగం, మాధవి దంపతులకు ఒక కుమారుడు, కుమార్తె అభిరామి(3) ఉన్నారు. శుక్రవారం ఇంటి పక్కన నిలిపివుంచిన ట్రాక్టర్ ఇనుప చక్రాలు వద్ద ఆడుకుంటుండగా, ఒక్కసారిగా ఇనుప చక్రం చిన్నారి పై పడడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే చిన్నారిని ఆసుపత్రికి తరలిస్తుండగా, గురునానక్ కళాశాల సమీపంలోకి రాగానే మృతి చెందింది. దీంతో తులేకాలన్ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## డ్రగ్స్ రహిత తెలంగాణే ప్రజాపాలన ప్రభుత్వ లక్ష్యం

### హుస్నాబాద్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెల్దండి వెంకటరమణ



విశ్వంభర, హుస్నాబాద్: అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా హుస్నాబాద్ పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వెల్దండి వెంకటరమణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, డ్రగ్స్ వినియోగం వ్యక్తిగత జీవితాన్నే కాకుండా కుటుంబాలు, సమాజాన్ని కూడా తీవ్రంగా దెబ్బతీస్తుందని అన్నారు. డ్రగ్స్ నిర్మూలనలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, ప్రజాపాలన ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్న "డ్రగ్స్ రహిత హుస్నాబాద్ -- డ్రగ్స్ రహిత తెలంగాణ" సాధనకు ప్రజలంతా సహకరించాలని పిలుపునిచ్చారు. మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు అవగాహన, అప్రమత్తత, సామాజిక భాగస్వామ్యం ఎంతో అవసరమని పేర్కొన్నారు. అనంతరం డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేస్తామని అందరూ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి, వైస్ చైర్మన్ చిత్తారి పద్మ రవీందర్, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ కేడం లింగమూర్తి, మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు వెన్న రాజు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బంక చందు, మున్సిపల్ కౌన్సిలర్లు పూదరి వరప్రసాద్, కేశవేణి రమేష్, గోపగోని శోభన్ గౌడ్, వైద్యం కిరణ్ ప్రసాద్, పిల్లి తిరుపతి, బొలిశెట్టి రాజు, బత్తుల స్వరూప, కోఆప్షన్ సభ్యులు ఎండి. హసన్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు, కార్యకర్తలు, పట్టణ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## కంటి ఆరోగ్యమే జీవన నాణ్యతకు ఆధారం

### హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి



విశ్వంభర, హుస్నాబాద్:హుస్నాబాద్ పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో 19వ వార్డు కౌన్సిలర్ బత్తుల స్వరూప రవీందర్ ఆధ్వర్యంలో, శరత్ మాక్స్ విజన్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సహకారంతో ఉచిత కంటి పరీక్షల శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కంటి ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ముఖ్యంగా 50 సంవత్సరాలు దాటిన వారు ఏడాదికి కనీసం ఒక్కసారైనా కంటి పరీక్షలు చేయించుకోవడం ద్వారా శుక్లాలు, గ్లూకోమా, మధుమేహం వల్ల వచ్చే కంటి సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స పొందవచ్చని తెలిపారు. కంటి చూపులో మార్పులు, మసకగా కనిపించడం, నొప్పి లేదా ఎర్రబడటం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. సమతుల్య ఆహారం తీసుకోవడం, పచ్చని ఆకుకూరలు, విటమిన్–ఏ అధికంగా ఉండే ఆహారం తీసుకోవడం, కళ్లకు విశ్రాంతి ఇవ్వడం, అవసరమైనప్పుడు రక్షణ కళ్లజోడు వినియోగించడం వంటి జాగ్రత్తలు పాటించాలని అన్నారు. ఈ శిబిరంలో సుమారు 60 మందికి పైగా కంటి పరీక్షలు నిర్వహించగా, అవసరమైన వారికి శుక్లాల శస్త్రచికిత్స కోసం సలహాలు అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ చిత్తారి పద్మ రవీందర్, మున్సిపల్ కౌన్సిలర్లు పూదరి వరప్రసాద్, కేశవేణి రమేష్, పిల్లి తిరుపతి, హుస్నాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెన్న రాజు, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెల్దండి వెంకటరమణ, నాయకులు బూరుగు కృష్ణస్వామి, గట్టు రాములు, బత్తుల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణే టార్గెట్‌గా బీజేపీ కుట్రలు : టీపీసీసీ ఉపాధ్యక్షుడు సంగిశెట్టి జగదీష్



విశ్వంభర, హైదరాబాద్ : దేశంలో ప్రజాస్వామ్యానికి పట్టుకొమ్మ అయిన ఓటు హక్కును కాలరాస్తూ, దొడ్డిదారిన అధికారంలోకి రావడమే లక్ష్యంగా బీజేపీ కుట్రలు చేస్తోందని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు సంగిశెట్టి జగదీష్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గాంధీ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎన్నికల వ్యవస్థను మంటగలుపుతోందని ఆరోపించారు. రాజ్యాంగం మనకు కల్పించిన ఓటు హక్కు ద్వారానే మన భవిష్యత్తును మనమే రాసుకునే అధికారం లభించిందని ఆయన గుర్తుచేశారు. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో కనీసం 'పాస్‌పోర్ట్' ఉన్నా కూడా పౌరసత్వంగా గుర్తించడం లేదనే ఆందోళన వ్యక్తమవుతోందని, కేవలం బీజేపీ మెంబర్‌షిప్ ఉంటేనే పౌరుడిగా పరిగణించేలా ఆ పార్టీ వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఇతర రాష్ట్రాలలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను అడ్డం పెట్టుకుని, లక్షలాది మంది అర్హులైన ఓటర్ల పేర్లను తొలగిస్తూ బీజేపీ ఎలా అధికారంలోకి వస్తుందో మనం ప్రత్యక్షంగా చూశామని సంగిశెట్టి జగదీష్ పేర్కొన్నారు. దేశంలో ఇప్పటివరకు 8 సార్లు ఈ 'ఆ×=' ప్రక్రియ జరిగిందని, ఇప్పుడు వారి తదుపరి టార్గెట్ 'తెలంగాణ' అని బీజేపీ నేతలు బహిరంగంగానే మాట్లాడుతున్నారని ఆయన హెచ్చరించారు. బీజేపీ కేవలం రాజకీయాలకే పరిమితం కాకుండా అన్ని రంగాల్లోనూ దోపిడీకి పాల్పడుతోందని జగదీష్ ఆరోపించారు. "బీజేపీ కేవలం ఓట్ల చోరీ, ఈవీఎం చోరీ, సీట్ల చోరీ మాత్రమే చేయడం లేదు; ఏకంగా పక్క పార్టీలను దొంగిలించడం , చివరకు రాముని గుడి చందాలను కూడా చోరీ చేసే స్థాయికి దిగజారింది" అంటూ తీవ్ర విమర్శలు చేశారు. ఈ ఓట్ల దొంగతనం కుట్రలను తిప్పికొట్టాలంటే ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. కొత్తగా ఓటు నమోదు చేసుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, అర్హులైన వారందరూ ఓటు హక్కును సాధించుకుని, దాన్ని సద్వినియోగం చేసుకోవడం ద్వారానే ఈ రాజ్యాంగ వ్యతిరేక శక్తులకు బుద్ధి చెప్పగలమని ఆయన స్పష్టం చేశారు.

## 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలి

### వార్డు కౌన్సిలర్ పూదరి వరప్రసాద్ గౌడ్




విశ్వంభర, హుస్నాబాద్ : ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఓటరు తమ ఓటు భద్రతను కాపాడుకోవడంతో పాటు, 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని హుస్నాబాద్ మున్సిపల్ 11వ వార్డు కౌన్సిలర్ పూదరి వరప్రసాద్ గౌడ్ పిలుపునిచ్చారు. 11వ వార్డులో నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా ఈనెల 25 నుంచి ప్రారంభమైన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం జూలై 25 వరకు కొనసాగుతుందని తెలిపారు. వార్డు ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఓటరు వివరాలను బీఎల్‌ఓ, బీఎల్‌ఏల సహకారంతో పరిశీలించుకోవాలని సూచించారు. ఓటరు జాబితాలో పేర్లు, చిరునామా, వయస్సు తదితర వివరాల్లో ఏవైనా మార్పులు, చేర్పులు అవసరమైతే వెంటనే చేసుకోవాలని, ఓటు హక్కును పరిరక్షించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి కొమురయ్య, వైస్ చైర్మన్ చిత్తారి పద్మ రవీందర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వెల్దండి వెంకట రమణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వెన్నె రాజు, కౌన్సిలర్లు పిల్లి తిరుపతి,కేశవేణి రమేష్, బత్తుల స్వరూప, కాంగ్రెస్ నాయకులు బూరుగు కృష్ణస్వామి, బత్తుల రవీందర్, గట్టు సాయి కృష్ణ,గట్టు శ్రీనివాస్, పూదరి శ్రీధర్, జక్కని సాగర్, కాంసాని శంకర్, పూదరి సత్యం, బైరి రవి, గట్టు యాదలక్ష్మి, పూదరి స్రవంతి, పూదరి రమ, బైరి రమ, తాళ్లపెల్లి అంజయ్య, బీఎల్‌ఓ తాళ్లపెల్లి సంతోషిని, బీఎల్‌ఏ పచ్చిమట్ల ప్రకాష్, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## అయ్యగారి పల్లిలో వానల కోసం వరద పాశం

విశ్వంభర, ఇనుగుర్తి: వానలు కురిపించాలని కోరుతూ వాన దేవునికి ఇనుగుర్తి మండలం అయ్యగారి పల్లి గ్రామంలో వార్డు సభ్యులు చీకటి అశోక్ ఆధ్వర్యంలో శుక్రవారం వరద పాశం సమర్పించారు. ఎంతో భక్తి శ్రద్ధలతో వరదపాశాన్ని మహిళలు తయారు చేసి, పసుపు కుంకాలతో అలంకరించిన బిందెలలో జలాన్ని గ్రామం బయటి పెద్ద బండ వద్దకు తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ వానల రాకఆలస్యం అయితే పూర్వం నుంచి వాన దేవునికి వరద పాశం సమర్పించి పూజలు చేసే వారిని, ఈసారి వర్షాలు ఇప్పటిదాకా లేకపోవడంతో సంబంధిత సాంప్రదాయం ప్రకారం వరుణునికి వరద పాశం సమర్పించి పూజలు చేసినట్లు తెలిపారు. వరద పాశం సమర్పించిన వారిలో కొనతం సమ్మక్క,గాజుల శాంతమ్మ,మాలోతు మంజుల, గాజుల పావని,గాజుల రమ,మామిడి స్వాతి,గాజుల సమ్మక్క పాల్గొన్నారు.

## మేజర్ శివ కిరణ్ (రిటైర్డ్) మృతికి సంతాపం



విశ్వంభర, బషీర్ బాగ్ : సుకుకి ఎక్స్‌నోరా, జియో మ్యాప్ సొసైటీ వ్యవస్థాపకులు, ప్రఖ్యాత సామాజిక సేవకులు మేజర్ శివ కిరణ్ మృతి పట్ల ఫోరం ఫర్ బెటర్ హైదరాబాద్ తన ప్రగాఢ సంతాపాన్ని తెలిపింది. స్థిరమైన వ్యర్థాల నిర్వహణను ప్రోత్సహించడం, చెత్త ఏరుకునే కార్మికుల (రాగ్ పికర్స్) పునరావాసం, సంక్షేమం కోసం మేజర్ శివ కిరణ్ (రిటైర్డ్) కృషి చేశారని ఫోరం ఫర్ ఎ బెటర్ హైదరాబాద్ పేర్కొంది. అలాగే హైదరాబాద్‌లో పౌర మౌలిక వసతుల అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు నిరంతరం సేవలందించడం ద్వారా విశేష గుర్తింపు పొందారనీ వెల్లడించింది. ఫోరం ఫర్ ఎ బెటర్ హైదరాబాద్ కు మేజర్ శివ కిరణ్ తో చిరకాల అనుబంధం ఉందని, పర్యావరణం, పౌర సంక్షేమానికి సంబంధించిన అనేక కార్యక్రమాల్లో ఆయనతో కలిసి పనిచేసే అవకాశం ఎఫ్ బి హెచ్ కు లభించిందనీ పేర్కొంది. మేజర్ శివ కిరణ్ కుటుంబ సభ్యులకు ఫోరం ఫర్ ఎ బెటర్ హైదరాబాద్ తన ప్రగాఢ సానుభూతిని తెలిపింది.

## మాదకద్రవ్యాల పై యుద్ధానికి బీఆర్ఆర్ ఫౌండేషన్ శ్రీకారం

### -యువతకు బూడిద రామ్ రెడ్డి పిలుపు



విశ్వంభర, ఇబ్రహీంపట్నం: డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడి, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా బీఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఫౌండేషన్ చైర్మన్ బూడిద రామ్ రెడ్డి నాయకత్వంలో జరిగిన ఈ ర్యాలీలో యువత, సామాజిక కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని డ్రగ్స్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బూడిద రామ్ రెడ్డి మాట్లాడుతూ, "డ్రగ్స్ అనేది యువత భవిష్యత్తును నాశనం చేసే సామాజిక మహమ్మారి. మత్తు పదార్థాలకు దూరంగా ఉండి విద్య, ఉపాధి, క్రీడలు, సమాజ సేవ వైపు యువత అడుగులు వేయాలి. ప్రతి కుటుంబం, ప్రతి విద్యాసంస్థ, ప్రతి పౌరుడు డ్రగ్స్ నిర్మూలనలో భాగస్వామి కావాలి. అవగాహనతోనే ఈ మహమ్మారిని పూర్తిగా నిర్మూలించగలం" అని అన్నారు.డ్రగ్స్ రహిత తెలంగాణ, డ్రగ్స్ రహిత భారతదేశ నిర్మాణమే బీఆర్ఆర్ ఫౌండేషన్ ధ్యేయమని ఆయన స్పష్టం చేశారు. సమాజంలో చైతన్యం పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తామని తెలిపారు. ర్యాలీ సందర్భంగా యువత డ్రగ్స్‌కు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయగా, ప్రజలు విశేష మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఆర్ ఫౌండేషన్ సభ్యులు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## పైప్‌లైన్ పనులతో వ్యాపారుల ఇబ్బందులు

### కాంట్రాక్టర్ల పనితీరుపై విమర్శలు



విశ్వంభర, మహబూబాబాద్: మహబూబాబాద్ రైల్వే స్టేషన్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు ఉన్న ప్రధాన రహదారిపై చేపడుతున్న పైప్‌లైన్ పనులు స్థానిక వ్యాపారులు, ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. రోడ్డు పక్కన కాలువలు తవ్వి పైప్‌లైన్ వేసిన అనంతరం రహదారి పక్క భాగాన్ని యథావిధిగా పునరుద్ధరించకపోవడంతో దుకాణాలకు వచ్చే వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానికుల కథనం ప్రకారం జేసీబీలతో కాలువలు తవ్వి, తవ్విన మట్టిని ట్రాక్టర్ల ద్వారా తరలించిన అనంతరం పైప్‌లైన్‌ను ఏర్పాటు చేసి పనులను ముగిస్తున్నారని, అయితే తవ్విన ప్రాంతాలను సక్రమంగా పూడ్చకుండా వదిలేయడంతో రోడ్డు పక్క భాగం పూర్తిగా దెబ్బతిన్నట్లు చెబుతున్నారు. దీంతో పాదచారులు నడవడానికి కూడా ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, దుకాణాలకు వినియోగదారుల రాక తగ్గి వ్యాపారులు రోజువారీ ఆదాయాన్ని కోల్పోతున్నామని వాపోతున్నారు. ఈ పనులు మున్సిపాలిటీ అధికారుల పర్యవేక్షణలోనే జరుగుతున్నాయా? లేక కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారా? అనే ప్రశ్నలు స్థానికుల నుంచి వ్యక్తమవుతున్నాయి. పనుల నాణ్యత, భద్రతా ప్రమాణాలపై అధికారులు తగిన పర్యవేక్షణ చేపట్టడం లేదని ఆరోపిస్తున్నారు. రోడ్డు పక్కన దుమ్ము, బురద పేరుకుపోవడం, పాదచారులకు సరైన మార్గం లేకపోవడం, ట్రాఫిక్‌కు అంతరాయం కలగడం వంటి సమస్యలతో ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారని పేర్కొంటున్నారు. పనులు పూర్తయిన తర్వాత రహదారి పక్క భాగాన్ని యథాస్థితికి తీసుకువస్తారా? వ్యాపారులకు కలుగుతున్న నష్టానికి ఎవరు బాధ్యత వహిస్తారు? అనే ప్రశ్నలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మున్సిపాలిటీ అధికారులు వెంటనే స్పందించి పనులను పరిశీలించి, కాంట్రాక్టర్లతో నాణ్యత ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని, ప్రజలకు, వ్యాపారులకు ఇబ్బందులు కలగకుండా రహదారిని త్వరితగతిన పునరుద్ధరించాలని మహబూబాబాద్ ప్రజలు, వ్యాపారులు కోరుతున్నారు.





## పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి : జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

**విశ్వంభర, పెద్దపల్లి:** పెద్దపల్లి జిల్లాలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించి,కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28న 'బూత్ డే' నిర్వహిస్తున్నట్లు, ఆ తర్వాత 29, 30 తేదీలలో ఇంటింటి సర్వే చేపడుతున్నట్లు జిల్లా వ్యాప్తంగా 62,902 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని, పోలియో చుక్కల పంపిణీ కోసం జిల్లాలో 381 బూత్‌లు, 25 మొబైల్ టీమ్స్, 24 ట్రాన్సిట్ పాయింట్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, పంచాయతీ కార్యదర్శులు తమ పరిధిలోని ప్రతి కుటుంబాన్ని సందర్శించి చిన్న పిల్లల వివరాలను సేకరించాలని, ?ముఖ్యంగా వలస కూలీలు, ఇటుక బట్టీలు, నిర్మాణ రంగంలో పనిచేసే వారి పిల్లలు ఈ కార్యక్రమానికి దూరంగా ఉండే అవకాశం ఉన్నందున, వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. రైల్వే స్టేషన్లు, బస్ స్టాండ్ల వంటి రద్దీ ప్రదేశాలలో ట్రాన్సిట్ పాయింట్ల ద్వారా ప్రయాణికులకు కూడా సేవలందించాలని, ?ఈ ప్రక్రియలో వైద్య ఆరోగ్య శాఖతో పాటు విద్యా, మహిళా శిశు సంక్షేమ శాఖల అధికారుల సమన్వయం తప్పనిసరి అని, ఏ ఒక్క చిన్నారి కూడా పోలియో చుక్కలు వేయించుకోకుండా మిగిలిపోకూడదని,అధికారులు తమ బాధ్యతను సక్రమంగా నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## కోలేటి మారుతికి ఘనంగా సన్మానం



**విశ్వంభర, కమాన్ పూర్ :** అమెరికా పర్యటన ముగించుకుని స్వగ్రామమైన కమాన్ పూర్ మండల కేంద్రంలోని స్వగృహానికి చేరుకున్న కరీంనగర్ ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షులు, కమాన్ పూర్ ఉమ్మడి మండల మాజీ ఎంపీపి కోలేటి మారుతి కి కమాన్ పూర్ మండల వైశ్య సంఘం ఆధ్వర్యంలో శాలువాలు కప్పి ఘనంగా ఆత్మీయ సత్కారం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో, వైశ్య సంఘం మండల అధ్యక్షుడు తాటిపల్లి శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ గుండా శ్రీనివాస్, క్యాషియర్ మరాల రాజన్న, గుండా ప్రేమ్ కుమార్, మాజీ అధ్యక్షుడు కోలేటి బాపన్న, మాదూరి చంద్రశేఖర్, తాటిపల్లి సురేష్, కొల్లూరు శ్రీనివాస్, మాదూరి పూర్ణచందర్, గుండా నాగయ్యలతో పాటు పాల్గొన్నారు.

## పేదల ఇంటి కలలను నెరవేస్తున్న ప్రభుత్వం



**విశ్వంభర, దోమ:** కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఇంటి కలను నెరవేస్తున్నదని దోమ మండల కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ రాఘవేందర్ రెడ్డి అన్నారు. దోమ మండల పరిధిలోని ఊటుపల్లి గ్రామంలో బండి నర్సమ్మ శ్రీనివాస్ ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయన పాల్గొని రిబ్బన్ కట్ చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ.. గతంలో ఏ ప్రభుత్వం కూడా పేదలకు ఇండ్లు కేటాయించలేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు పేదలకు ఇంటి కలను నెరవేర్చుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆదరణ చూరగొంటుంది అని అన్నారు.రానున్న రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టి అమలు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మొగులయ్య,జగన్,శ్రీనివాస్,ప్రవీణ్, దశరథ్, వెంకటయ్య, పాల్గొన్నారు.

## డ్రగ్స్ రహిత తెలంగాణ మనందరి లక్ష్యం
### డీఎస్పీ తిరుపతిరావు



**విశ్వంభర, మహబూబాబాద్ :** జిల్లా కేంద్రంలోని సబ్ జైల్లో అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు . ఈ కార్యక్రమానికి జైలర్ మల్లెల శ్రీనివాసరావు అధ్యక్షతన వహించారు . ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథి గా మహబూబాబాద్ డిఎస్పి నంబూరు తిరుపతి రావు హాజరయ్యారు . తొలుత జైల్లోని ఖైదీలచే డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞను చేయించారు . అనంతరం డి.ఎస్.పి మాట్లాడుతూ, డ్రగ్స్ అనేవి యువతను నిర్వీర్యం చేస్తూ వారి భవిష్యత్తును అంధకారం చేస్తున్నాయన్నారు , డ్రగ్స్, గంజాయి లాంటి మత్తు పదార్థాలు ఏరూపంలో వున్నా, సేవించినా, ఇతరులకు అమ్మినా రవాణా చేసినా తీవ్ర నేరంగా పరిగణించ బడుతుందని , హెచ్చరించారు . డ్రగ్స్ బారిన పడ్డ యువత తీవ్ర నేరాలకు పాల్పడుతుండడంతో వారి కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయని వాపోయారు . డ్రగ్స్ మహమ్మారిని తుదముట్టించేందుకు పోలీస్ శాఖ తీవ్రంగా కృషి చేస్తోందన్నారు . అందులో భాగంగా గంజాయి సాగు, అమ్మకంతో పాటు ఉపయోగించే వారిపై నిరంతరం పోలీస్ డేగకన్ను ఉంటుందని హెచ్చరించారు. డ్రగ్స్ నిర్మూలన కోసం సమాజంలో భాద్యత కలిగిన ప్రతి పౌరుడూ భాగస్వామ్యం కావాలని కోరారు . ఎక్కడ డ్రగ్స్ ఆనవాళ్లు కనిపించినా పోలీస్ వారికి సమాచారం ఇవ్వాలన్నారు . ఇందుకు ఐదువేల రూపాయల పారితోషకం కూడా ఉంటుందని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు . నేర అవినీతి రహిత సమాజమే తెలంగాణ పోలీస్ లక్ష్యమని పేర్కొన్నారు . నాడు డ్రగ్స్ బారిన పడ్డ చైనా, మలేషియా దేశాల అభ్యర్థనతో ఐక్యరాజ్యసమితి తీర్మానం మేరకు 1988లో జూన్ 26 తేదీని అంతర్జాతీయ డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలియజేశారు . అనంతరం గంజాయితో పాటు వివిధ నేరాలకు పాల్పడిన ఖైదీలకు ప్రత్యేకంగా సూచనలూ సలహాలతో కౌన్సిలింగ్ ఇచ్చారు . ఈ కార్యక్రమంలో సిటిజన్ ఫోరం సభ్యులు శంతన్ రామరాజు, జైలు సిబ్బంది మోటపోతుల వీరన్న , మహ్మద్ ఖలీల్, ఎమ్మెనో లక్ష్మన్, పోషిని జనార్ధన్, రామాంజనేయులు, నర్సింహారావుతో పాటు ఖైదీలు తదితరులు పాల్గొన్నారు

# ఇనుగుర్తి హై స్కూల్ కు మహర్దశ రూ.7 కోట్లతో నూతన భవనాలు

### కాంపౌండ్ కు భూమి పూజ..



**విశ్వంభర,ఇనుగుర్తి:** బిఆర్ఎస్ పార్లమెంటరీ డిప్యూటీ లీడర్,పెట్రోలియం సహజవాయువు పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, గాయత్రి గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత ఎంపీ వద్దిరాజు రవిచంద్ర కృషి ఫలితంగా రూ.7 కోట్లతో మండల కేంద్రం ఇనుగుర్తి జిల్లా పరిషత్ హై స్కూల్ రాష్ట్రంలోనే అధునాతన మౌలిక వసతులతో ఆధునికరిస్తున్నారు.రూ.1 కోటి ఎంపీ రవిచంద్ర నిధులు. ఆయన సిఫారసుతో పెట్రోలియం గ్యాస్ కంపెనీలు మరో రూ.6 కోట్ల తో సాయి ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భవనాలు, కాంపౌండ్ ఏర్పాటుకు అంకురార్పణ జరిగింది.ఎంపీ రవిచంద్ర సోదరుడు,బిఆర్ఎస్ రాష్ట్ర నేత వద్దిరాజు కిషన్ సమక్షంలో స్థానిక సర్పంచి తమ్మడపల్లి కుమార్, పిఏసిఎస్ చైర్మన్ దీకొండ వెంకన్న గౌడ్,తహసిల్దార్ శ్రీనివాసులు,ఎంపీడీవో బండారి పార్థసారథి,ఎస్సై గంగారపు కరుణాకర్,ఇన్చార్జి హెచ్ఎం అమ్మ యాకయ్య, దిశ సభ్యులు బాబురావు, సాయి ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కరుణాకర్ రెడ్డి, పిఎ రవీందర్, వద్దిరాజు వెంకన్న,అభ్యుదయ భావకవి రాజిరెడ్డి,వివిధ పార్టీల నాయకులు ప్రభృతులు శుక్రవారం హై స్కూల్ నూతన భవనాలు,కాంపౌండ్ నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు.

**రవిచంద్ర తోనే పాఠశాలకు మహర్దశ: సర్పంచి**

ఎంపీ రవిచంద్ర తోనే తాను చదువుకున్న ఇనుగుర్తి హై స్కూల్ కు మహర్దశ చేకూరిందని సర్పంచి తమ్మడపల్లె కుమార్ అన్నారు.రవిచంద్ర కృషి ఫలితంగానే రూ.7 కోట్లతో ఇనుగుర్తిలో సకల సౌకర్యాలతో కూడిన ఆధునిక పాఠశాల,కాంపౌండ్ నిర్మాణం జరగబోతోందని దీంతో ఇనుగుర్తి తో పాటు పరిసర ప్రాంతాల విద్యార్థులకు మంచి మౌలిక వసతుల తో కూడిన నాణ్యమైన విద్య అందుతుందని తెలిపారు.కార్యక్రమంలో ఉపసర్పంచి యాదగిరి, హెచ్ ఎం వీరన్న,వార్డు సభ్యులు వేముల శ్రీనివాస్,బూర ఇస్తారి,గోపందాస్ కృష్ణ,గుజ్జునూరి యశోద ఏఎంసి డైరెక్టర్ కొట్టం రాము,వివిధ పార్టీల నాయకులు బైరు అశోక్ గౌడ్,కూరెల్లి సతీష్,బొబ్బిలి మహేందర్ రెడ్డి,దార్ల రామ్మూర్తి,చెడుపాక యాకయ్య,భూక్య వెంకన్న,గంజి రాజేందర్ రెడ్డి,పింగిలి శ్రీనివాస్,బేతమల్ల చంద్రయ్య,గంజి శ్రీనివాస్ రెడ్డి,గండు నాగన్న గౌడ్,రాయలి ఉపేందర్,చిట్టబోయిన యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ మహిళా శక్తితో మహిళలకు భరోసా

### -చీరల పంపిణీలో ఎమ్మెల్యే మల్ రెడ్డి



**విశ్వంభర, ఇబ్రహీంపట్నం:** మహిళల ఆత్మగౌరవాన్ని పరిరక్షిస్తూ, వారి ఆర్థిక సాధికారతకు కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఆదిభట్ల సర్కిల్ పరిధిలోని మన్నెగూడ జేఎంఆర్ గార్డెన్‌లో నిర్వహించిన ఇందిరమ్మ మహిళా శక్తి కార్యక్రమంలో ఆయన పాల్గొని మహిళా సంఘాల సభ్యులు, మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మహిళల అభ్యున్నతే రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి లక్ష్యాల్లో కీలక భాగమని పేర్కొన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగేందుకు అవసరమైన సహాయ సహకారాలను ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. ప్రతి మహిళకు సంక్షేమ పథకాల ప్రయోజనాలు పారదర్శకంగా చేరేలా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుందన్నారు. మహిళా సంఘాలను మరింత బలోపేతం చేయడం ద్వారా స్వయం ఉపాధి అవకాశాలు పెంపొందించి, కుటుంబాల ఆర్థిక స్థితిని మెరుగుపర్చడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. మహిళలు ఆర్థికంగా బలోపేతం కావడం ద్వారా సమాజం మరింత అభివృద్ధి చెందుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, వివిధ శాఖల అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు, స్థానిక మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# శివాజీ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ఈటల రాజేందర్



**విశ్వంభర, కుత్బుల్లాపూర్:** రంగారెడ్డి నగర్ డివిజన్లో ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్ హాజరై విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ, ఛత్రపతి శివాజీ భరతమాత ముద్దుబిడ్డ. ఆయన కమిట్మెంట్ ధైర్య సాహసాలు అనితర సాధ్యం అని అన్నారు. అన్ని మతాలను సమానంగా చూసిన మానవతావాది, ఆ మహనీయుని ఆశయాలు పునికి పుచ్చుకొని కోల్పోయిన విశ్వాసాలు సంప్రదాయాలు ఆలయాలను మన మోడీ భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం పునరుద్ధరిస్తూ కాపాడుతున్నరని అన్నారు . ప్రపంచం ఉన్నంతవరకు భారతదేశ సంస్కృతి సాంప్రదాయాలు ఇతిహాసాలు మానవసంబంధాలు శాశ్వతంగా ఉంటాయన్నారు . మన స్పిరిచువల్ పవర్ అర్థం చేసుకొని ప్రపంచంలో అనేక దేశాలు మనలను అనుసరిస్తున్నాయి. ఇక్కడ ఉన్న రోడ్డు సమస్యలను పరిష్కరించే బాధ్యత నాది. 12 సంవత్సరాల మోదీ గారి పాలన చూసిన తర్వాత అన్ని రాష్ట్రాల ప్రజలు ఆయన పాలనాన్ని కోరుకుంటున్నారు. తెలంగాణ రాష్ట్రం అప్పుల ఊబిలోనుండి బయటపడాలన్న పాత గ్లోరీ రావాలన్నా ఇక్కడ కూడా భారతీయ జనతా పార్టీ అధికారంలోకి రావాలని ప్రజలందరూ కోరుకుంటున్నారు అందుకు అనుగుణంగా పని చేద్దాం అన్నారు . ఈ కార్యక్రమంలో కుత్బులపూర్ అసెంబ్లీ కన్వీనర్ శేఖర్ యాదవ్,బాచుపల్లి కార్పొరేటర్ విజయలక్ష్మి సుబ్బారావు,వినాయక నగర్ కార్పొరేటర్ రాజ్యలక్ష్మి,మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి భరత్ సింహారెడ్డి,గాజులరామారం కార్పొరేటర్ శేషగిరి రావు,సీనియర్ నాయకులు సికింద్రాబాద్ జిల్లా ఇంచార్జ్ మరియు మేడ్చల్ మల్కాజ్గిరి ఇంచార్జి నందనందివాకర్, ఒక్కంటి దయాకర్,కాంటోన్మెంట్ బోర్డుమెంబెర్ భానుక నార్మధ మల్లికార్జున్,కాంటోన్మెంట్ వైస్ ప్రెసిడెంట్ బి ఎన్ శ్రీనివాస్, రంగారెడ్డి నగర్ డివిజన్ అధ్యక్షులు మణికంఠ,సీనియర్ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మత్తు రహిత సమాజమే లక్ష్యం: డీఎస్పీ ప్రసన్నకుమార్

### డి అడిక్షన్ సెంటర్ లో బాధితులకు పండ్లు, క్రీడా సామాగ్రి పంపిణీ చేసిన పోలీసులు. హాజరైన రాష్ట్ర ఈగల్ పోలీస్ సిబ్బంది




**విశ్వంభర, సూర్యాపేట:** సూర్యాపేట జిల్లాను మత్తు రహితంగా మార్చడమే లక్ష్యంగా పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని డీఎస్పీ ప్రసన్నకుమార్ తెలిపారు. ఈరోజు సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన డీ-అడిక్షన్ కేంద్రాన్ని పట్టణ సీఐ వెంకట్‌తో కలిసి ఆయన సందర్శించారు. అక్కడ చికిత్స పొందుతున్న నలుగురు బాధితులను పరామర్శించి, వారికి పండ్లు పంపిణీ చేశారు. మత్తు అలవాట్ల నుంచి ఉపశమనం పొందేందుకు వీలుగా క్యారమ్స్, చెస్ వంటి ఇండోర్ గేమ్స్ కిట్లను అందజేశారు.ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. గంజాయి, ఇతర మత్తు పదార్థాల రవాణాపై యుద్ధం ప్రకటించామని, పాత నేరస్థులపై నిరంతర నిఘా ఉంచామన్నారు. మద్యం తాగిన వారిని గుర్తించినట్లే, గంజాయి సేవించిన వారిని పట్టుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేక కిట్లను అందించిందని డీఎస్పీ అన్నారు. వ్యసనాల బారిన పడిన యువతను మార్చడానికి డీ-అడిక్షన్ కేంద్రం ఎంతో దోహదపడుతుందని, బాధితులు స్వచ్ఛందంగా చేరవచ్చని సూచించారు. మత్తు పదార్థాల సమాచారం కోసం ప్రజలు డయల్ 100, 112 లేదా 1908 టోల్ ఫ్రీ నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర ఈగల్ పోలీస్ ఫోర్స్ సిబ్బంది, డాక్టర్స్, పట్టణ ఇన్స్పెక్టర్ వెంకటయ్య ఉన్నారు.

# పార్టీలకు అతీతంగా మొహర్రం వేడుకలు

**విశ్వంభర, హనుమకొండ:** వర్ధన్నపేట నియోజకవర్గం లోని 14వ డివిజన్ బాలాజీ నగర్ జంక్షన్ లో పార్టీలకు, మతాలకు అతీతంగా మొహర్రం వేడుకలు ఘనంగా నిర్వహించారు. మొహర్రం సందర్భంగా రహదారిలోని పాదచారులకు సేమియాలు పంపిణీ చేయడం జరిగింది. టిఆర్ఎస్ పార్టీ నాయకులు మడుసు నరసింహం, కాంగ్రెస్ నాయకులు సయ్యద్ ఇంతియాజ్, మహమ్మద్ జానీ లు మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా కులమతాలకు అతీతంగా మొహర్రం పండుగ సందర్భంగా డివిజన్లోని, జిల్లా, రాష్ట్రంలోని రైతులు వర్షాకాలం వచ్చినప్పటికీ వర్షాలు సకాలంలో పడకపోవడంతో రైతులు ఎంతో ఇబ్బందులకు గురవుతున్నారని, రైతులు బాగుంటేనే దేశం బాగుంటుందనే నినాదంతో మొహర్రం పండుగ సందర్భంగా వర్షాలు నిండుగా పడాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో పలు పార్టీల నాయకులు కేతిరి రాజశేఖర్, పైసా మహేష్, యూసుఫ్, సలీం, పోతు చంద్రశేఖర్, ఈర్ల రాజేందర్, రాజు, కన్ని తదితరులు పాల్గొన్నారు.



## కోనూరు గోపాల్ గౌడ్‌కి నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలం, సిరిపురం గ్రామానికి చెందిన కోనూరు గోపాల్ గౌడ్ అనారోగ్యంతో మృతి చెందగా, విషయం తెలుసుకున్న నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య కోనూరు గోపాల్ గౌడ్ పార్థివ దేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## చాకల్ పల్లిలో ఎస్ఐఆర్ ఫారాల పంపిణీ



**విశ్వంభర, పరిగి:** ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రారంభమైన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో ప్రజలందరూ చురుకుగా పాల్గొని సహకరించాలని మండల కాంగ్రెస్ అధ్యక్షులు చంద్రశేఖర్ కోరారు. చౌడాపూర్ మండల పరిధిలోని చాకల్ పల్లి గ్రామంలో ఇంటింటి ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షులు చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా, సమగ్రంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ బీఎల్ఓ లకు సహకరించాలని కోరారు. బీఎల్ఓ లు ప్రతి ఓటరు ఇంటిని మూడుసార్లు సందర్శించి వివరాలను సేకరిస్తారని తెలిపారు. బీఎల్ఏలు, ఎన్యుమరేటర్లు ప్రతి ఇంటిని సందర్శించి ఎస్ఐఆర్ ఫారాలను పంపిణీ చేయడంతో పాటు అవసరమైన వివరాలను నమోదు చేస్తారని చెప్పారు. అర్హులైన ప్రతి పౌరుడు తమ వివరాలను సక్రమంగా అందించి ఓటరు జాబితా సవరణ ప్రక్రియ విజయవంతానికి తోడ్పడాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ లో ఏమైన ఇబ్బందులు వున్న ఎల్లవేళల అందుబాటులో వుండి సహకరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బి ఎల్ ఓ సుధాకర్, బి ఎల్ ఎ బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

## మొహర్రం వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి



**విశ్వంభర, పరిగి:** పట్టణంలో మొహర్రం పండుగ సందర్భంగా పరిగి ఎమ్మెల్యే, తెలంగాణ పిసిసి ట్రైనింగ్ కమిటీ చైర్మన్ రామ్మోహన్ రెడ్డి స్థానిక ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులతో కలిసి పీర్ల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించినట్లు తెలిపారు. మొహర్రం పండుగ సోదర భావం సామరస్యం ఐక్యతకు ప్రాతీక, అన్ని వర్గాల ప్రజలు పరస్పర ప్రేమాభిమానాలతో ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సిద్ధాంతి పార్థసారథి, మున్సిపల్ చైర్పర్సన్ రజిత వెంకటేష్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సయ్యద్ అయ్యుబ్, కోఆప్షన్ సభ్యులు అక్బర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు రామకృష్ణారెడ్డి, కాంగ్రెస్ నాయకులు అభిరాం పంతులు, గోపాల్, కుడుముల యాదయ్య, చిన్న నరసింహులు, మహమ్మద్ పటేల్, మల్లేష్, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

## నేరడ ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు.. ఈనెల 27, 29 తేదీల్లో ప్రవేశాలకు అవకాశం




**విశ్వంభర, మహబూబాబాద్:** కురవి మండలం నేరడలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాలలో 2026--27 విద్యా సంవత్సరానికి ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం ఈనెల 27, 29 తేదీల్లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ వై. శ్రీకాంత్ తెలిపారు. ఆరవ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఖాళీగా ఉన్న సీట్లను ఆఫ్‌లైన్ విధానంలో భర్తీ చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు సంబంధిత ధ్రువపత్రాలతో పాఠశాలకు హాజరై దరఖాస్తు ఫారాన్ని సమర్పించి ప్రవేశం పొందవచ్చని సూచించారు. అలాగే, జూనియర్ కళాశాలలో ప్రస్తుత 2026--27 విద్యా సంవత్సరం నుంచి ఏసీఈ కొత్త కోర్సును ప్రవేశపెట్టినట్లు తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ వై. శ్రీకాంత్ కోరారు.

# సంఘాల పేరుతో విద్యాసంస్థలను ఇబ్బంది పెట్టవద్దు

**పాఠశాల వాతావరణాన్ని దెబ్బతీవద్దు**

**విద్యార్థుల రవాణా బస్సులు అడ్డగించడం,**

**చందాల రూపంలో డబ్బు వసూళ్లకు పాల్పడడం చట్ట విరుద్ధం**



విశ్వంభర, సూర్యాపేట: ప్రవేట్ విద్యాసంస్థల ను సంఘాల పేరుతో ఇబ్బందులు, బెదిరింపులకు గురి చేస్తున్నారు, అని వివిధ సమస్యలపై ప్రవేట్ విద్యాసంస్థల నుండి పిర్యాదు వస్తున్నాయని సూర్యా ఎట డివిజన్ డీఎస్పీ ప్రసన్న కుమార్ చెప్పారు. గురువారం రోజున సూర్యాపేట జిల్లా కేంద్రంలో గల త్రివేణి పాఠశాల లోకి కొంత మంది వ్యక్తులు విద్యార్థి సంఘాల పేరుతో అక్రమంగా చొరబడి కార్యాలయం తాళాలు పగలగొట్టి, పెద్దగా నినాదాలు చేస్తూ విద్యార్థులను భయాందోళనకు గురిచేసిన విషయమై యాజమాన్యం పిర్యాదు మేరకు సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్ లో క్రిమినల్ కేసు నమోదు చేశాం అని ఆయన ఒక ప్రకటనలో తెలిపినారు. విద్యార్థి సంఘాల పేరుతో విద్యార్థులకు అసౌకర్యం కలిగించవద్దు, విద్యాసంస్థల యాజమాన్యాలను, ఉపాధ్యాయుల ను ఇబ్బందులకు గురి చేయవద్దు అని ఈ సందర్భంగా వివిధ రకాల సంఘాలకు డీఎస్పీ సూచించారు. పాఠశాలల్లో, విద్యాసంస్థల్లో ప్రశాంత వాతావరణాన్ని దెబ్బతీసేలా ప్రవర్తించడం, విద్యార్థులను రవాణా చేసే బస్సులను అడ్డుకోవడం, యాజమాన్యాలను లేదా ఉపాధ్యాయులను బెదిరించడం, పెద్ద శబ్దాలతో నినాదాలు చేస్తూ విద్యార్థులు భయపడేలా వాతావరణం సృష్టించడం, చందాల రూపంలో డబ్బు వసూళ్లు చేయడం వంటి చర్యలకు పాల్పడడం చట్ట విరుద్ధం అని హెచ్చరించారు. ప్రవేటు విద్యాసంస్థల్లో ఏవైనా సమస్యలు ఉంటే, వాటిపై సంబంధిత జిల్లా అధికారులకు, విద్యాశాఖ అధికారులకు పిర్యాదు చేయాలి, సమస్యలపై అధికారులు నిబంధనల ప్రకారం విచారణ, దర్యాప్తు జరిపి తగిన చర్యలు తీసుకుంటారని తెలిపారు. అంతే కానీ, విద్యార్థి సంఘాల పేరు చెప్పుకుని పాఠశాలల్లో ఇబ్బందికర వాతావరణాన్ని సృష్టించవద్దని, విద్యార్థుల చదువులకు ఆటంకం కలిగిస్తూ వారికి అసౌకర్యం కలిగించకూడదని సూచించారు.

ఏవైనా ఫిర్యాదులు ఉంటే విద్యాశాఖ అధికారులకు లేదా ఉన్నతాది ,కారులకు మాత్రమే నివేదించాలని, చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని విద్యాసంస్థల నిర్వహణకు ఆటంకం కలిగిస్తే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సూర్యాపేట డివిజన్ డీఎస్పీ స్పష్టం చేశారు. కేసులు నమోదు చేయడం, బైండోవర్ చేయడం లాంటి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది అని హెచ్చరించారు.

## పేదలను ఆదుకోవాలి : శ్రీనివాస రావు

### గుండ్ల సింగారం విద్యార్థులకు ఎఐఎస్ఎఫ్ విద్యా సామగ్రి



విశ్వంభర, హనుమకొండ : గుండ్ల సింగారంలో ఇళ్లు కోల్పోయిన పేదలకు అదే స్థలంలో పట్టాలు ఇచ్చి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని ఎఐఎస్ఎఫ్ మాజీ జాతీయ అధ్యక్షుడు తక్కలపల్లి శ్రీనివాసరావు అన్నారు. హనుమకొండ మండలం గుండ్ల సింగారంలోని సురవరం సుధాకర్ రెడ్డి నగర్‌లో ఇళ్ల కూల్చివేతతో నిరాశ్రయులైన కుటుంబాల విద్యార్థులకు శుక్రవారం ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో 120 మంది విద్యార్థులకు 500 నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు తదితర విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తక్కలపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ, పేదల ఇళ్లను తొలగించే ముందు సర్వే నిర్వహించి అర్హులైన వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని, వారి నివాస హక్కులను కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు. నిరాశ్రయులైన కుటుంబాల పిల్లల చదువులకు ఆటంకం కలగకుండా ఎఐఎస్ఎఫ్ అండగా ఉంటుందని తెలిపారు..ఎఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎస్.ఎ. స్టాలిన్, రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ బాధిత విద్యార్థులకు ప్రభుత్వం అన్ని విధాలా సహాయం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో: మాజీ రాష్ట్ర నాయకుడు కర్రె బిక్షపతి, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బాషబోయిన సంతోష్, జాతీయ కార్యవర్గ సభ్యుడు ఇటికల రామకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సొంతుకు ప్రవీణ్, జిల్లా అధ్యక్షుడు వుట్కూరి ప్రణీత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోంది

**ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**



విశ్వంభర, హనుమకొండ: వరంగల్ పశ్చిమ నియోజకవర్గాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని, ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని దశలవారీగా అమలు చేస్తూ ప్రతి కాలనీ, ప్రతి వార్డులో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి గారు అన్నారు. శుక్రవారం హనుమకొండలోని 58వ డివిజన్ పరిధిలోని శ్రీనగర్ కాలనీ సౌత్, శ్రీనగర్ కాలనీ నార్త్, కేయూ కాలనీ, రాఘవేంద్ర నగర్ ఫేజ్-2, వెంకటేశ్వర టెంపుల్ పరిసరాలు, శ్యామల దుర్గాదాస్ కాలనీలలో సుమారు రూ.1.28 కోట్ల వ్యయంతో అంతర్గత సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, గతంలో ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న మౌలిక వసతుల సమస్యలను ప్రజా ప్రభుత్వం ఒక్కొక్కటిగా పరిష్కరిస్తోందన్నారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం, పారిశుధ్య వాతావరణం కల్పించేందుకు ప్రతి కాలనీలో అవసరమైన రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులను చేపడుతున్నామని తెలిపారు. అభివృద్ధి అనేది కేవలం మాటల్లో కాకుండా ప్రతి ప్రాంతంలో కనిపించేలా పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. వరంగల్ పశ్చిమ నియోజక వర్గంలోని దాదాపు అన్ని డివిజన్లలో అభివృద్ధి పనులు ఇప్పటికే పూర్తయ్యాయని, మిగిలిన ప్రాంతాల్లో కూడా వేగంగా పనులు కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజల అవసరాలను ప్రత్యక్షంగా తెలుసుకుంటూ, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కాలనీ వాసులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ పనులు చేపడుతున్నామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల సమస్యల పరిష్కారానికే పెద్దపీట వేస్తోందని, పారదర్శక పాలన, జవాబుదారీతనం, వేగవంతమైన అభివృద్ధే తమ ప్రభుత్వ ప్రత్యేకత అని అన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడం తమ బాధ్యతగా భావిస్తూ ప్రతి రూపాయి ప్రజల సంక్షేమం, అభివృద్ధికే ఖర్చు చేస్తున్నామని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌లో మౌలిక వసతుల కల్పన, తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు, విద్యుత్, పారిశుధ్యం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించామని, ప్రజలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా అవసరమైన అన్ని సౌకర్యాలను అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. అభివృద్ధి పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, అధికారులు పనులను నిర్దేశిత ప్రమాణాలతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ప్రజలకు ఉపయోగపడే విధంగా ప్రతి అభివృద్ధి పనిని పారదర్శకంగా అమలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతిని ధులు, కాంగ్రెస్‌పార్టీ నాయకులు, డివిజన్ నాయకులు, అధికారులు, ఇంజినీరింగ్ శాఖ సిబ్బంది, కాలనీ వాసులు, యువకులు పాల్గొన్నారు.

## కరీంనగర్ కవులకు సన్మానం




విశ్వంభర, హైదరాబాద్ :తెలంగాణ సాహిత్య అకాడమీ, యు అండ్ మి సంస్థ సంయుక్తంగా మనోవైజ్ఞానిక అంశం మనశ్శాంతే జీవన కాంతి అంశంపై హైదరాబాద్ లోని రవీంద్రభారతిలో నిర్వహించిన కవితా పఠనంలో కరీంనగర్ కు చెందిన వైరాగ్యం ప్రభాకర్ జీవన సూత్రాలు, కోట లక్ష్మణ్ క్షమా భావం,అనంతోజు పద్మశ్రీ అంతరంగ దర్పణం,మాసం సీమ స్నేహం మరియు మానసిక మద్దతు కవితలు చదివి ఆహుతులను ఆకట్టుకున్నారు. తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షులు,కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డా.నందిని సిధారెడ్డి , తెలంగాణ సాహిత్య అకాడమీ ప్రధాన కార్యదర్శి నామోజు బాలాచారి, తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షులు నాళేశ్వరం శంకరం, ప్రముఖ సైకాలజిస్ట్ డా.సి.వీరేందర్ చేతులమీదుగా ఘన సన్మానం పొందారు.వైరాగ్యం ప్రభాకర్ చదివిన కవితకు ప్రత్యేక బహుమతిని ప్రకటించి సన్మానించారు.ఈ సందర్భంగా పలువురు కవులు, సాహితీ వేత్తలు అభినందించారు .

## డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి




విశ్వంభర, బాగ్ లింగంపల్లి : అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా నిరోధక దినోత్సవం సందర్భంగా వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ ఆధ్వర్యంలో హైదరాబాదు బాగ్ లింగంపల్లి సుందరయ్య పార్క్‌లో యాంటీ డ్రగ్స్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చిక్కడపల్లి ఏసీపీ రాణా వీరారెడ్డి, సీఐ మల్లేశం యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ అధ్యక్షుడు ఎస్. మనోహర్ రెడ్డి, మాజీ అధ్యక్షుడు పి.వి. నిరంజన్ రెడ్డి, వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షుడు వి. నాగభూషణం, సంపత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మొహర్రం పీర్ల ఊరేగింపులో పాల్గొన్న జగ్గారెడ్డి, నిర్మల




విశ్వంభర, సంగారెడ్డి : సంగారెడ్డి లో మొహర్రం ఘనంగా జరిగింది. మొహర్రం సందర్భంగా జగ్గారెడ్డి పాత బస్టాండ్ సమీపం లో దర్గా ను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం పీర్ల ఊరేగింపు లో పాల్గొన్నారు. పీర్ల ఊరేగింపు చూసేందుకు వందల సంఖ్య లో ప్రజలు హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి ప్రజలకు షర్బత్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ మొహర్రం పండుగ మత సామరస్యానికి ప్రతీక అని కుల మతాల కు అతీతంగా పెద్ద ఎత్తున ప్రజలు మొహర్రం వేడుకల్లో హాజరయ్యారన్నారు. ప్రతీ సంవత్సరం మాదిరిగానే ఈ సారి మొహర్రం వేడుకలు ఘనంగా జరిగాయి అన్నారు. మొహర్రం సందర్భంగా ప్రజలకు షర్బత్ను టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి , రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధారాణి, టీ పిసిసి ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత్ కిషన్, కూన సంతోష్, షఫీ హాఫీజ్ లతో కలిసి పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో టీపిసిసి ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత్ కిషన్, నాయకులు. కూన సంతోష్, సంగారెడ్డి మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ హాఫీజ్, మైనార్టీ నాయకులు తాహెర్, కుతుబుద్దీన్, నదీం, కౌసర్, ఇమ్రాన్, ఆమెర్ జాన్, హకీమ్, ఖమర్ తదితరులు పాల్గొన్నారు.

## గచ్చిబౌలి ఏఎంబీ మాల్ ఫ్లైఓవర్‌పై యాక్సిడెంట్.. ఇద్దరు మృతి



విశ్వంభర, హైదరాబాద్ :హైదరాబాద్ గచ్చిబౌలిలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఏఎంబీ ఫ్లైఓవర్‌పై రాంగ్ రూట్‌లో వచ్చిన స్కూటీని బుల్లెట్ బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో స్కూటీపై ప్రయాణిస్తున్న ఇద్దరు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. బుల్లెట్‌పై ప్రయాణిస్తున్న వ్యక్తి స్వల్పంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. శుక్రవారం ఉదయం 7.30 గంటల సమయంలో వినోద్ అనే వ్యక్తి గచ్చిబౌలి నుంచి హాఫీజ్‌పేట వైపు బుల్లెట్ బైక్‌పై వెళ్తున్నాడు. అదే సమయంలో హాఫీజ్‌పేట నుంచి గచ్చిబౌలి వైపు ఏఎంబీ మాల్ ఫ్లైఓవర్‌పై రాంగ్ రూట్‌లో స్కూటీపై శ్రీకాంత్, విఠల్ వచ్చారు. ఈ క్రమంలో స్కూటీ, బుల్లెట్ బైక్ ఒకదానికొకటి బలంగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో శ్రీకాంత్, విఠల్ ఇద్దరూ ఎగిరిపడ్డారు. వారు హెల్మెట్ పెట్టుకోకపోవడంతో వారి తలలు రోడ్డుకు బలంగా తగలడంతో ఇద్దరూ అక్కడికక్కడే మరణించారు. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## 'పద్మశాలి సంఘ బలోపేతం, ఉద్యోగుల సంక్షేమమే లక్ష్యం'




విశ్వంభర, కొత్తగూడెం: తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం రాష్ట్ర సంస్థాగత అధ్యక్షుడు ఈగ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పద్మశాలి ఉద్యోగుల సదస్సులో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. సదస్సులో సంఘ ఐక్యతను మరింత బలోపేతం చేయడం, పద్మశాలి ఉద్యోగుల హక్కుల పరిరక్షణ, సంక్షేమ కార్యక్రమాల సమర్థవంతమైన అమలు, సేవా కార్యక్రమాల విస్తరణ వంటి అంశాలపై రాష్ట్ర నాయకత్వం దిశానిర్దేశం చేసింది. ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంతో పాటు భవిష్యత్ కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు అనంతుల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, రాష్ట్రస్థాయి సదస్సులు సంఘ బలోపేతానికి, ఉద్యోగుల మధ్య ఐక్యత పెంపొందించేందుకు దోహదపడతాయని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి వచ్చిన ప్రతినిధులతో అభిప్రాయాల మార్పిడి ద్వారా సంఘాన్ని మరింత బలోపేతం చేసే అవకాశాలు ఏర్పడతాయని పేర్కొన్నారు. సదస్సును విజయవంతంగా నిర్వహించిన రాష్ట్ర కమిటీని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యవర్గ సభ్యులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి దూలం నట్రాజ్, సంస్థాగత కార్యదర్శి పసునూతి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షురాలు కొండి పద్మజ, సంయుక్త కార్యదర్శి వన్నాల విద్యాసాగర్, నిర్వాహక కార్యదర్శి బాతాల వెంకటేశ్వర్లు, క్రియాశీలక సభ్యురాలు కొండి విజయలక్ష్మి పాల్గొన్నారు.

### మహేశ్వరం మండలాన్ని

# ఫ్యూచర్ సిటీలో కలపకుండా అడ్డుకుంటున్న సబితా ఇంద్రారెడ్డి

**ఫ్యూచర్ సిటీ జేఏసీ చైర్మన్ వత్తులు రఘుపతి**



విశ్వంభర, మహేశ్వరం : ఎక్కడో దూరంగా ఉన్న గ్రామాలను భారత్ ఫ్యూచర్ సిటీలో కలిపారు, కానీ పక్కనే ఉన్న మహేశ్వరం లో ఉన్న 33 గ్రామాల పేర్లు మాత్రం లేవు వెంటనే మహేశ్వరంలో ఉన్న 33 గ్రామాలను ఫ్యూచర్ సిటీలో కలపాలని ఫ్యూచర్ సిటీ జేఏసీ చైర్మన్ వత్తుల రఘుపతి,అన్ని రాజకీయ పార్టీల అఖిలపక్ష నాయకులు కోరారు, మహేశ్వరం మండలం లోని కర్నాటి మనోహర్ బిల్డింగ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఫ్యూచర్ సిటీ జేఏసీ చైర్మన్ వత్తుల రఘుపతి, అన్ని రాజకీయ పార్టీల అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ, ఎక్కడో కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామాలను ఫీచర్స్ సిటీ లో కలిపినప్పుడు పక్కనే ఉన్న మహేశ్వరం మండలంలో ఉన్న గ్రామాలను ఎందుకు కలపడం లేదని వారు ప్రశ్నించారు, మహేశ్వరం లో ఉన్న గ్రామాలను ఫ్యూచర్ సిటీలో కలపకుండా స్థానిక ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి , బిఆర్ఎస్ పార్టీ నాయకులు సర్పంచులు అడ్డుకుంటున్నారని వారు ఆరోపించారు, మహేశ్వరం అభివృద్ధి చెందడం సబితా ఇంద్రారెడ్డి ఇష్టం లేదు అని వారు ప్రశ్నించారు, మహేశ్వరంలో అభివృద్ధి కోసం ఎంతగానో కృషి చేస్తున్న అని చెప్పిన మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మహేశ్వరాన్ని ఫ్యూచర్ సిటీలో కలిపితే అభివృద్ధి జరుగుతుందా కలపకపోతే అభివృద్ధి జరుగుతుందా వారే చెప్పాలని ఎందుకు ఫ్యూచర్ సిటీలో కలపకుండా అడ్డుకుంటున్నారో వివరణ ఇవ్వాలని తెలిపారు, లేనిపక్షంలో ఈనెల 27న శనివారం జరిగే కేటీఆర్ కార్యక్రమానికి భారీ ఎత్తున పాల్గొని నిరసన తెలుపుతామని హెచ్చరించారు,మహేశ్వరం లోని గ్రామాలను ఫ్యూచర్ సిటీలో కలపకుండా అడ్డుకుంటున్న బిఆర్ఎస్ పార్టీ సర్పంచులు నాయకులు చరిత్ర హీనులుగా మిగిలిపోతారని హెచ్చరించారు, భవిష్యత్తు తరాల కోసం మన పిల్లల కోసం ఫ్యూచర్ సిటీలో గ్రామాలు కలిపితే మన భూములు రేట్లు పెరిగి గ్రామాలు ఎంతగానో అభివృద్ధి చెందుతాయని అన్ని పార్టీల నాయకులు జేఏసీ ద్వారా ఏర్పడి ఉద్యమాలు చేస్తుంటే బి ఆర్ఎస్ పార్టీ నాయకులు మాత్రం తమాషాగా నవ్వుకుంటున్నారని వారు అన్నారు, ఫ్యూచర్ సిటీలో మహేశ్వరంలో ఉన్న గ్రామాలు కలిపే వరకు ఎంతటి పోరాటమైన చేస్తామని అవసరమైతే బిఆర్ఎస్ నాయకులను ప్రజాక్షేత్రంలో తేల్చుకుంటామని అన్నారు, కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి మహేశ్వరంలోని గ్రామాలను ఫ్యూచర్ సిటీ లో కలపాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు, ఫ్యూచర్ సిటీ లో కలిపే వరకు జేఏసీ నాయకులు ముఖ్యమంత్రి దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కారం చేయాలని అప్పటి వరకు జేఏసీ నాయకులు కలిసి అందరం పోరాటం చేయాలని వారు తీర్మానం చేశారు, త్వరలోనే భవిష్యత్తు ప్రణాళిక విధివిధానాలు ఖరారు చేసి ఫ్యూచర్ సిటీలో మహేశ్వరం గ్రామాలను కలిపేవరకు పోరాటం చేస్తామని అన్నారు, ఫ్యూచర్ సిటీ అంటే మహేశ్వరం మహేశ్వరం అంటే ఫ్యూచర్ సిటీ అలాంటి ఫ్యూచర్ సిటీలో మహేశ్వరం కలపకపోవడం విడ్డూరంగా ఉందన్నారు, మహేశ్వరంలో ఉన్న గ్రామాలను ఫ్యూచర్ సిటీలో కలపకుండా కావాలని అడ్డుకుంటూ కుట్ర చేస్తున్నారని, ఇప్పటికైనా అందరం కలిసి పోరాటం చేస్తామని జేఏసీ చైర్మన్ వత్తుల రఘుపతి అన్నారు, ఈ కార్యక్రమంలో జేఏసి నాయకులు కర్నాటి మనోహర్, బిజెపి నాయకుడు సుదర్శన్ యాదవ్, ఎడమ మోహన్ రెడ్డి, దత్తు నాయక్, సర్పంచ్ దేవేందర్ నాయక్, గోపాల్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## సేవాలాల్ దేవాలయానికి భూమి పూజ

విశ్వంభర,పాలకుర్తి : పాలకుర్తి మండలం రాజీవ్ తండా లో సేవాలాల్ మహారాజ్, జగదాంబ ఆలయానికి శుక్రవారం భూమి పూజ నిర్వహించారు. ఈ భూమి పూజ కార్యక్రమానికి లంబాడీల ఆరాధ్య దైవం పూజారి శేఖర్ మహారాజ్ మహారాష్ట్ర నుంచి హాజరయ్యారు. సేవాలాల్ మహారాజ్ ఆలయం, జగదాంబ ఆలయాలకు శేఖర్ మహారాజ్ గురువు ప్రత్యేక పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన మహిళలు భక్తి తో చేసిన నృత్యాలు అలరించాయి. అనంతరం తండా ప్రజలకు ఇస్లావత్ వనితశంకర్ అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దుద్దిళ్ల శ్రీను బాబు, మాజీ ఉప సర్పంచ్ జ్యోతి శంకర్ నాయక్, తండా సర్పంచ్ అఖిల అంజీ నాయక్ , ఉపసర్పంచ్ రాజేశ్వరి సారయ్య, నాయకులు సూర సమ్మయ్య మల్లయ్య,పాల్గొన్నారు.

## సారపాకలో కొరవడిన పారిశుధ్య నిర్వహణ

విశ్వంభర, బూర్గంపహాడ్: బూర్గంపహాడ్ మండలంలోని పారిశ్రామికవాడగా ఉన్న సారపాక మేజర్ పంచాయతీలో ప్రజా పాలన 'చెత్త' పాలనగా మారింది. పారిశుధ్య పర్యవేక్షణలో అధికారుల పర్యవేక్షణ కొరవడినట్లు కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. ఇక్కడ ప్రజాప్రతినిధిగా ఉన్న యువ సర్పంచ్ ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు ఒకవైపు ఉంటే మరోవైపు బదిలీపై వచ్చిన కార్యదర్శి పారిశుధ్య నిర్వహణ పట్టించుకోవడంలో విఫలమయ్యారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిత్యం వందలాది మంది భక్తులు, పర్యాటకులు, ప్రయాణీకులు భద్రాచలం-సారపాక బ్రిడ్జి మీదుగా పుణ్యక్షేత్రానికి వెళ్తుంటారని, అయితే ఈ జాతీయ రహదారి పక్కనే ఆటోల్లో చెత్తను తెచ్చి పారబోయడంతో దుర్వాసన వెదజల్లుతూ ప్రజల అనారోగ్యానికి కారణభూతాలుగా మారుతున్నాయని పలువురు మండిపడుతున్నారు. ఐటీసీ కర్మాగారానికి వెళ్లే రహదారి మధ్యలో ఉన్న డివైడర్‌లో సైతం చెత్తాచెదారం పేరుకుపోయి అపరిశుభ్ర వాతావరణం కనిపిస్తుంది.

# మహిళగా నటించి.. 1.46 కోట్లు కొట్టేసి..



విశ్వంభర, హైదరాబాద్ : మ్యాట్రిమోనీ వేదికలో ఒక మహిళగా పరిచయం చేసుకుని పెండ్లి చేసుకుంటామంటూ నమ్మించి ఒక నకిలీ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాట్‌ఫామ్‌లో భారీగా పెట్టుబడి పెట్టించి మోసం చేసిన కేసులో నలుగురు కేటుగాళ్లను హైదరాబాద్ సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేశారు. ఈ సంవత్సరం ఫిబ్రవరిలో సైబర్ క్రైమ్ పోలీసులకు బాధితుడి నుంచి ఫిర్యాదు అందింది. సంగం మ్యాట్రిమోనీలో నిందితులు ఒక మహిళగా నటిస్తూ బాధితుడితో పరిచయం పెంచుకున్నారు. పెండ్లి చేసుకుంటామని నమ్మించి, అధిక లాభాలు వస్తాయంటూ ఒక ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీలో పెట్టుబడి పెట్టేలా బాధితుడిని ప్రలోభపెట్టారు. స్క్రీన్‌పై నకిలీ లాభాలను చూపిస్తూ బాధితుడి నుంచి విడతల వారీగా వివిధ బ్యాంక్ ఖాతాల్లోకి మొత్తం రూ. 1.46కోట్లు బదిలీ చేయించుకున్నారు. ఆ తర్వాత బాధితుడు తన డబ్బును వచ్చిన లాభాలతో కలిపి విత్ డ్రా చేసుకోవడానికి ప్రయత్నించగా, మరిన్ని అదనపు రుసుములు చెల్లించాలని డిమాండ్ చేస్తూ విత్ డ్రాలను నిలిపివేశారు. దీంతో తాను మోసపోయానని గ్రహించిన బాధితుడు సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసిన పోలీసులు సిద్దిపేటకు చెందిన చొక్కాల సంపత్, సికింద్రాబాద్‌కు చెందిన హెచ్చు నరేశ్, ఎండ్ల సురేశ్, వడ్కల మహేశ్‌లను పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రధాననిందితుడు పరారీలో ఉండగా ఈ నలుగురు నిందితులు పలు నకిలీ బ్యాంక్ ఖాతాలను ఉపయోగించి రూ. 46.65 లక్షలు డ్రా చేసి ఆ నిధులను హవాలా నెట్‌వర్క్ ద్వారా సింగపూర్‌కు చెందిన సైబర్ నేరగాళ్లకు చేరవేసినట్లు విచారణలో తేలినట్లు పోలీసులు తెలిపారు. ఈ దర్యాప్తులో భాగంగా నగదు బదిలీకి ఉపయోగించిన మ్యూల్ బ్యాంక్ ఖాతాలు మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల్లో విస్తరించి ఉన్నట్లు గుర్తించారు. ముఖ్యంగా ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ ఖాతాల ద్వారా సుమారు రూ. 35లక్షలు చేతులు మారినట్లు పోలీసులు గుర్తించారు. ఈ నిందితులంతా ప్రధాన నిందితుడి ఆదేశాల మేరకు పనిచేశారని, మ్యాట్రిమోనీలో నమోదు చేసుకున్నవారిని గుర్తించి వారిని ఉచ్చులోకి దింపి నెమ్మదిగా వారితో నకిలీ కంపెనీలలో పెట్టుబడులు పెట్టించడం, దానిద్వారా మ్యూల్‌ఖాతాల్లోకి డబ్బులు పంపించడం చేసేవారని పోలీసులు చెప్పారు. అరెస్టైన నలుగురు 10శాతం నుంచి 30శాతం వరకు కమీషన్ తీసుకునేవారని, మ్యూల్ ఖాతాలనుంచి డబ్బులను విత్ డ్రా చేయడంతో ప్రధాననిందితులకు సహకరించినట్లుగా పోలీసులు తెలిపారు.

## భక్తి శ్రద్ధలతో ఊట్కూరులో మొహర్రం ఉత్సవాలు



విశ్వంభర, ఊట్కూర్ : నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండల కేంద్రంలో మొహరం వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. నవమి, దశమి ఉత్సవాల సందర్భంగా కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తుంచారు. శుక్రవారం హసన్, హుస్సేన్ పీర్ల సవారిని పురవీధుల్లో వైభవంగా ఊరేగించారు. మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి పీర్ల చావడిని దర్శించుకోగా నిర్వాహకులు ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా చిట్టెం మాట్లాడుతూ.. మొహరం వేడుకలు మతసామరస్యానికి, సోదర భావానికి ప్రతీకగా నిలుస్తున్నాయని, ఇలాంటి ఉత్సవాలు సమాజంలో ఐక్యతను మరింత బలోపేతం చేస్తాయని అన్నారు. భక్తులు ప్రశాంత వాతావరణంలో వేడుకలు నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు కోరం శివరాజ్ రెడ్డి, రైతు బంధు సమితి మాజీ మండల అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు వెంకటేష్ గౌడ్, తరుణ్, ఆనంద్ రెడ్డి, ఈశ్వర్ యాదవ్, శివారెడ్డి, ఒబేదుర్ రహిమాన్, షేక్ షమీ, హోటల్ ఖాలిక్ పాల్గొన్నారు.

# 15 ఏండ్లుగా పరారీలో.. చిక్కిన రౌడీషీటర్



విశ్వంభర, హైదరాబాద్ : పదిహేను ఏండ్లుగా పోలీసుల కళ్లు గప్పి చట్టానికి దొరక్కుండా తిరుగుతున్న రౌడీషీటర్‌ను బంజారాహిల్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళ్తే..బంజారాహిల్స్ రోడ్ నం. 12లోని సయ్యద్‌నగర్‌కు చెందిన అర్షద్అలీ అలియాస్ అర్షద్ ఖాన్(50) అనే వ్యక్తి 2003లో బంజారాహిల్స్‌లో మరో నలుగురితో కలిసి నవీన్ అనే వ్యక్తిని హత్య చేసిన కేసులో నిందితుడిగా ఉన్నాడు. అదే సంవత్సరంలో నిజామాబాద్‌లోమరో వ్యక్తిని హత్య చేశాడు. హుమాయున్‌నగర్, వనస్థలిపురం ప్రాంతాల్లో చోరీ కేసుల్లో సైతం అర్షద్ అలీ నిందితుడిగా ఉన్నాడు. పలు కేసుల్లో నిందితుడిగా ఉన్న అర్షద్ అలీని వనస్థలిపురం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మూడేళ్ల పాటు జైల్లో ఉన్న తర్వాత బయటకు వచ్చాడు. పోలీసులకు దొరక్కుండా ఉండేందుకు మహారాష్ట్రలోని పాలాఘర్ జిల్లాలోని వసాయ్ ప్రాంతానికి వెళ్లిపోయాడు. అప్పటికే సయ్యద్‌నగర్‌లో భార్యా, పిల్లలు ఉండడంతో వారిని వదిలిపెట్టిన అర్షద్ మహారాష్ట్రలో మరో యువతిని పెళ్లి చేసుకుని అక్కడే ఉండిపోయాడు. కాగా కొన్నాళ్ల తర్వాత బండ్లగూడ ప్రాంతంలోని ఓ చిరునామాతో తన పేరును సయ్యద్ షకీల్‌గా మార్చుకుని వెళ్లాడు. కాగా అప్పుడప్పుడు హైదరాబాద్‌కు వచ్చి వెళుతుండేవాడు. కాగా 2010లో బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కత్తితో తిరుగుతున్నాడన్న ఆరోపణలపై అర్షద్ అలీ అలియాస్ షకీల్ మీద ఆర్మ్స్ యాక్ట్ కింద కేసు నమోదయింది. కాగా అప్పటినుంచి ఆ కేసు కోర్టులో పెండింగ్‌లో ఉంది. అర్షద్ అలీ కోర్టుకు హాజరుకాకపోవడంతో అతడిపై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ అయింది. అయితే అతడి అచూకీ లభ్యం కాకపోవడంతో పోలీసులు ఆశలు వదులుకున్నారు. కాగా ఇటీవల పాత కేసుల దర్యాప్తు గురించి వెస్ట్‌జోన్ ఉన్నతాధికారులు సమీక్ష నిర్వహిస్తున్న సమయంలో పరారీలో ఉన్న అర్షద్ అలీ వ్యవహారం బయటకు వచ్చింది. దీంతో తక్షణమే అతడిని అరెస్ట్ చేయాలని బంజారాహిల్స్ ఇన్‌స్పెక్టర్ సుహాసన్ ఆదేశాల మేరకు ఎస్ఐ శ్రీనివాసులు, ఏఎస్ఐ ముజఫర్ అలీ, కానిస్టేబుల్ ఎన్.సుభాష్‌లతో ప్రత్యేక బృందం రంగంలోకి దిగింది. సయ్యద్‌నగర్ ప్రాంతంలోని అర్షద్ అలీ స్నేహితులతో పాటు బంధువులపై నిఘా పెట్టడంతో పాటు అతడి రెండో భార్య వివరాలను సంపాదించారు. ఆమె కాల్‌డేటా ఇతర ఆధారాలతో మహారాష్ట్రకు వెళ్లిన బంజారాహిల్స్ పోలీసులు శుక్రవారం నిందితుడు అర్షద్ అలీని అరెస్ట్ చేశారు.

## వికటించిన పెళ్లి భోజనం.. పలువురికి వాంతులు




విశ్వంభర, మహబూబ్ నగర్‌లోని న్యూ మోతీనగర్‌లో పలువురు అస్వస్థతకు గురయ్యారు. పెళ్లి భోజనం వికటించడంతో 30 మందికిపైగా వాంతులు చేసుకున్నారు. దాంతో, వారిని వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ముప్ఫయి మందికి పైగా అనారోగ్యంతో బాధ పడడానికి కారణం పాడైన పెళ్లి భోజనాలను తినడమే కారణమని తెలిసింది. గురువారం కొందరు పెళ్లిలో మిగిలిన భోజనాలను న్యూ మోతీనగర్ బస్తీవాసులకు ఇచ్చి వెళ్లారు. శుక్రవారం ఆ ఆహారం తిన్నవారు అస్వస్థతకు లోనై వాంతులు చేసుకున్నారు. ఈ ఘటనపై పోలీసులు, వైద్య అధికారులు విచారణ జరుపుతున్నారు.

## స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే



విశ్వంభర, నాగర్ కర్నూల్ : కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. భూత్పూర్ మండలం అన్నాసాగర్ గ్రామంలో తన నివాసానికి వచ్చిన బూత్ లెవెల్ ఆఫీసర్ అడిగిన సమాచారం, డాక్యుమెంట్లను,ఎన్యూమరేషన్ ఫారమ్‌ను అందజేశారు . ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో సర్‌లో జరుగుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే అడ్డాకుల మండలం పొన్నకల్ , రాచాల,గుడిబండ గ్రామాల బూత్‌ల వారీగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, బూత్ ఇన్‌చార్జ్‌లతో ప్రత్యేకంగా సమావేశమై బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం గురించి పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

## అల్లుడితో వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని భర్తను హత్య చేసిన భార్య

విశ్వంభర, నాగర్‌కర్నూల్ : తిమ్మాజీపేట మండలం ఆవంచ గ్రామంలో దారుణం చోటు చేసుకుంది. అల్లుడి తో కొనసాగిస్తున్న వివాహేతర సంబంధానికి అడ్డువస్తున్నాడనే కారణంతో తాళీ కట్టిన భర్తను భార్య హత్య చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది, గ్రామంలో అమ్మపల్లి యాదయ్య, అలివేలు దంపతులు. అలివేలుకు సొంత అల్లుడు ఆంజనేయులతో వివాహేతర సంబంధాని తెలుసుకున్న భర్త యాదయ్య భార్యతో గొడవ పెట్టుకున్నాడు. ఈ నెల 23న యాదయ్య ఇంట్లో మృతిచెందాడు. అనారోగ్యంతో మృతి చెందాడని భార్య కుటుంబ సభ్యులను , గ్రామస్తులను నమ్మించింది. అంత్యక్రియలకు ముందు శవానికి స్నానం చేయించి దుస్తులు మారుస్తుండగా శరీరంపై గాయాలు కనిపించడంతో అనుమానం వ్యక్తం చేస్తూ మృతుడి సోదరుడి కుమారుడు పరశురాములు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు విచారణ చేపట్టి ప్రశ్నించగా.. వివాహేతర సంబంధానికి భర్త అడ్డుగా ఉన్నాడనే కారణంతో అతని మర్మాంగాలపై దాడి చేసి హత్య చేసినట్లు నిందితురాలు , భార్య అలివేలు అంగీకరించింది. అదే రోజు కూతురు, అల్లుడు కూడా ఇంటికి వచ్చి వెళ్లిన నేపథ్యంలో వారి పాత్రపై కూడా అనుమానాలు ఉన్నాయని ఆరోపించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# దారి లేదని..చెరువు కట్టనే లేపేశారు!




విశ్వంభర,హైదరాబాద్ : హైదరాబాద్ కేంద్రంగా ఒకేసారి ఐదారు ప్రాజెక్టులను చేపట్టిన కాసా గ్రాండ్ నిర్మాణ సంస్థ..నార్త్ సిటీ కేంద్రంగా బహుళ సంఖ్యలో లగ్జరీ ప్రాజెక్టులను నిర్మిస్తోంది. లగ్జరీ విల్లాలు, అపార్టుమెంట్లతో పదుల ఎకరాల భారీ నిర్మాణాన్ని తీర్చిదిద్దుతోంది.అయితే మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని దుండిగల్-గండిమైసమ్మ మండల పరిధిలోని గాగిల్లాపూర్ గ్రామ పరిధిలో ఉన్న కోతినార్ చెరువు సమీపంలో భారీ లగ్జరీ విల్లా ప్రాజెక్టులను కాసా గ్రాండ్ సియోరా పేరిట నిర్మిస్తోంది. అయితే ప్రాజెక్టుకు అవసరమైన అప్రోచ్ రోడ్డు కో సం ఏకంగా చెరువు భూమిని చెరబట్టింది. అధికారికంగా హెచ్ఎండీఏ అనుమతుల కోసం సమర్పించిన లే అవుట్‌లో ఎలాంటి అప్రోచ్ రోడ్డును చూపని నిర్వాహకులు... ప్రాజెక్టును ఆనుకుని ఉన్న కట్టను విస్తరించి దర్జాగా బీటీ రోడ్డు పరుచుకున్నది. ఇదే తమ ప్రాజెక్టుకు గ్రాండ్ ఫోర్ వే హైవే అని కస్టమర్లను నమ్మించే ప్రయత్నం చేస్తోంది. ప్రభుత్వం నిర్దేశించిన అత్యంత కీలకమైన చెరువు ఎకాలజికల్ బఫర్ జోన్‌ను కూడా నిర్వీర్యం చేసిన కాసా గ్రాండ్ సంస్థ.. ఆక్రమణలతో ప్లాట్లు వేసినట్లుగా జాయింట్ సర్వేలో తేలింది. అక్రమాలపై రైతులు, గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేయడంతో రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ అధికారులు సంయుక్తంగా సర్వే చేయడంతో... లే అవుట్‌లో కట్ట నుంచి రోడ్డుకు అనుమతి లేదని, ఇదంతా ఉద్దేశపూర్వకంగా జరిగిందని తేల్చారు. దుండిగల్ తహసీల్దార్ రాజేశ్వర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదుతో సైబరాబాద్ పరిధిలోని దుండిగల్ పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేశారు. అయితే అధికారులు నోటీసులిస్తే.. తమ వద్ద ఇరిగేషన్ ఎన్వోసీ, హెచ్ఎండీఏ అనుమతులు ఉన్నాయని బుకాయించింది. కొనుగోలుదారులను నిండా ముంచేందుకు సిద్ధమైన కాసా గ్రాండ్.. ప్రచార ఆర్భాటంతో , అక్రమాలకు తెరలేపి, ఏకంగా చెరువు కట్టను మాయం చేసి ంది. అయితే ఇదే విషయంలో అటు కాసా గ్రాండ్ నిర్వాహకులను 'నమస్తే' సంప్రదించగా.. ఈ విషయం లో మాట్లాడానికి విముఖత వ్యక్తం చేశారు. ఎమ్మార్వో రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ చెరువు కట్ట విషయంలో కాసా గ్రాండ్ నిర్మాణ సంస్థకు ఎలాంటి అనుమతులు లేవన్నారు. నిర్ణీత గడువులోగా నిర్మాణ సంస్థ స్పందించకపోతే.. అనుమతులు రద్దు చేయాలని హెచ్ఎండీఏను కోరుతామన్నారు. కాగా, అప్రోచ్ రోడ్డు విషయంలో హెచ్ఎండీఏ అనుమతులు ఎలా ఇచ్చిందనేది పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

## రోడ్డు ప్రమాదంలో తండ్రి, కుమారుడు మృతి..

విశ్వంభర, జోగులాంబ : జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదం ఓ కుటుంబం తీవ్ర విషాదం నింపింది. ఇటిక్యాల పోలీస్ స్టేషన్ పరిధిలోని మునగాల శివారులో గురువారం రాత్రి జరిగిన యాక్సిడెంట్‌లో తండ్రి, కుమారుడు మృతి చెందారు. గుర్తు తెలియని వాహనం మెటార్ సైకిల్‌ను ఢీ కొట్టిన ఘటనలో రాయపురం గ్రామానికి చెందిన హనుమంతు, తిరుమలేశ్ ప్రాణాలు కోల్పోయారు. హనుమంతు భార్య లక్ష్మి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం రాయపురం గ్రామానికి చెందిన హనుమంతు కుటుంబం ఎర్రవల్లి మండలంలోని ధర్మవరంలో నివసిస్తోంది. అక్కడ పొలాన్ని కౌలుకు తీసుకొన్న హనుమంతు.. పంట పండిస్తూ జీవనం సాగిస్తున్నాడు. దేవర ఉత్సవం సందర్భంగా.. హనుమంతు, భార్య లక్ష్మి, కుమారుడు తిరుమలేశ్‌తో కలిసి మోటార్ సైకిల్‌పై గట్టులోని బంధువుల ఇంటికి వెళ్లారు. సాయంత్రం వీరు బండిపై తమ గ్రామానికి వస్తుండగా.. హనుమంతు మోటార్ సైకిల్‌ను ఓ గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ సంఘటనలో హనుమంతు అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రగాయాల పాలైన తిరుమలేష్ కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు విడిచాడు. హనుమంతు భార్య లక్ష్మి పరిస్థితి కూడా ఆందోళనకరంగా ఉంది. ఒకే కుటుంబంలోని తండ్రీకొడుకు మృతి చెందడంతో రాయపురం గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

## యువత మాదక ద్రవాల జోలికి పోవద్దు : సీపీ సన్ ప్రీత్ సింగ్



విశ్వంభర,వరంగల్ : డ్రగ్స్ రహిత సమాజం నిర్మాణంలో యువత భాగస్వాములు కావాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ పిలుపు నిచ్చారు. ప్రపంచ మాదక ద్రవ్యాల నిరోధక దినోత్సవాన్ని పురస్కరించుకోని వరంగల్ పోలీసు కమినరేట్ అధ్వర్యంలో వరంగల్ నగరం లో 2కె రన్ నిర్వహించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయము నుండి సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానం వరకు 2కె రన్ కోనసాగింది. ఈ పరుగులో ప్రతిభ కబరిచిన యువతకు ముఖ్య అతిధిల చేతుల మీదుగా పతకాలు, సర్టిఫికేట్లను అందజేశారు. ఈ సందర్భంగా సన్ ప్రీత్ సింగ్ మాట్లాడారు మాదకద్రవ్యాల సంబంధించి ప్రస్తుత సమాజంలో పెద్ద సమస్యగా మారిందని, యువత, విద్యార్థులు మాదకద్రవ్యాల జోలికి పోవద్దని, ఒక్కసారి వాటిని వినియోగించడం ద్వారా యువత జీవితాలు అంధకారం మారుతాయని అన్నారు. ముఖ్యంగా మత్తు పదార్థాలను విక్రయాలు, వినియోగించ ్డంలాంటి చర్యలకు పాల్పడి చిక్కుల్లో పడొద్దని, విద్యార్థులు కేవలం చదువులపైనే దృష్టి పెట్టాలని, అదే విధంగా యువత తమ ఉన్నంత లక్ష్య సాధనకై కృషి చేయాలని పోలీస్ కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమములో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కే.ఆర్ నాగరాజు, టీజీ ఎన్‌పిడిసిఎల్ ఎండీ వరుణ్ రెడ్డి, వరంగల్, హన్మకొండ కలెక్టర్లు డా.సత్యశారద, చాహత్ బాజ్‌పాయి, కుడా చైర్మన్ ఇనగాల వెంట్రామిరెడ్డి, డీసీపీలు దార కవిత, అంకిత్‌కుమార్, అడిషినల్ కలెక్టర్ సంధ్య తదితరులు పాల్గొన్నారు.

# కుడా'లో అభివృద్ధి కాదు అవినీతి రాజ్యమేలుతోంది

దాస్యం వినయ్ భాస్కర్



విశ్వంభర, హనుమకొండ : కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ ఆఫ్ అథారిటీ(కుడా)లో అవినీతి కుంభకోణంతో అధికార దుర్వినియోగానికి పాల్పడుతుందని ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ శాసన సభ్యుడు దాస్యం వినయ్‌భాస్కర్ మండిపడ్డారు. శుక్రవారం హనుమకొండలోని బీఆర్ఎస్ పార్టీ ఆఫీస్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాడిందే పాడు పాసుపళ్ల దాసు అన్న తీరుగా రెండున్నరేళ్లుగా ఏది జరిగినా మాపై ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ నాయకులు తుపాకి రాముళ్ల లాగా మాట్లాడుతున్నారు. ఇక్కడ అడ్డిమార్‌గుడ్డి దెబ్బలో గెలిచిన వ్యక్తి కొడతా, పొడుస్తా, తీస్తా అంటు పొడుగు పొడుగు మాటలు మాట్లాడుతూ, ఒక ప్రజాప్రతినిధిగా ఉండాల్సిన కనీస లక్షణాలు లేకుండా చిల్లర మాటలు మాట్లాడుతున్నారని వినయ్‌భాస్కర్ మండిపడ్డారు. 420 హామీలు, 6 గ్యారంటీ లు హామీ అమలు మరిచారు, కుడా పేరిట అభివృద్ధి మరిచి అవినీతికి తెరలేపారన్నారు. కుడా పేరిట అవినీతి జరుగుతోందని, అవినీతికి సహకరించాలని అధికారులపై ఒత్తిడి చేస్తున్నారన్నారు. అధికారులపై ఒత్తిడి పెరుగుతుందని, మా వాళ్లు వస్తారు ఈ ధరకు ఫిక్స్???చేయాలని ముందుగానే ఎక్కువ ధర పాడకుండా చూడాలని ముందే చెప్పుతున్నారని వాపోయారు. 30 మంది వేలం పాటలో పాల్గొంటే 10 మాత్రమే పాడటంపై అవినీతి జరిగిందని మండిపడ్డారు. బహిరంగ మార్కెట్‌లో ఆ స్థలంలో గజం ధర 1,50,000 కాగా కేవలం 66 వేలకే వేలం వేయడంపై వినయ్‌భాస్కర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్లాట్ల వేలంలో సీబీఐ, ప్రభుత్వ విచారణ జరిపించాలన్నారు. అధికార పార్టీ నాయకుల అధికార దుర్వినియోగం జరిగిందని కాంగ్రెస్ అభివృద్ధిని అటకెక్కించారు.. అవినీతిని పోషిస్తున్నారని వాపోయారు. ప్రపంచం అంతా ఆన్‌లైన్‌లో చేస్తుంటే కుడా వేలం ఆఫ్‌లైన్ జరిగిందని, కుడా ప్లాట్ల వేలంలో అవినీతి జరిగిందని వెంటనే కుడా వేలాన్ని రీకాల్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్ష పార్టీలపై కేసులు, దాడులు, కూల్చివేతలు, బెదిరింపులు కాకుండా మిగిలిన రెండున్నరేళ్లలో అభివృద్ధి పై దృష్టి పెట్టాలని హితవు పలికారు. చెరువును చట్టాలకు విరుద్ధంగా పూడ్చివేస్తున్నారు. వాల్టా యాక్ట్?కు తూట్లు పొడుస్తున్నారని, వైల్డ్?? లైఫ్ యానిమల్ ప్రొటెక్షన్ యాక్ట్?ను విస్మరించారన్నారు. యాదవ్‌నగర్-రెడ్డిపురం మార్గంలో ఉన్న చెరువును చట్టాలకు విరుద్ధంగా పూడ్చివేస్తున్నారని వినయ్‌భాస్కర్ మండిపడ్డారు. డబుల్ బెడ్రూం ఇల్లు కచ్చితంగా స్థానికులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రశ్నించినందుకు గుండాలతో దాడులు, అక్రమ కేసులకు భయపడేది లేదని, ప్రజల పక్షాన ఖచ్చితంగా పోరాడుతామని వినయ్‌భాస్కర్ హెచ్చరించారు.

## పరిమితికి మించి లోడ్ తీసుకెళ్లొద్దు: రవాణాశాఖ

విశ్వంభర,హైదరాబాద్ : రాష్ట్రంలో ఖనిజాలు, ఇతర వస్తువులను రవాణా చేసే వాహనాల్లో పరిమితికి మించి లోడ్ (ఓవర్ లోడింగ్) తీసుకెళ్లొద్దని రవాణాశాఖ ఆదేశాలు జారీ చేసింది. నిబంధనలు ఉల్లంఘిస్తే క్వారీ యజమానులు, మైనింగ్ కంపెనీలు, అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఈ మేరకు జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్(విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్) చంద్రశేఖర్‌గౌడ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

## జూలై 8 నుంచి సీపీగెట్

విశ్వంభర,హైదరాబాద్ : హనుమకొండ రస్తా, జూన్ 26 : తెలంగాణలోని వివిధ విశ్వవిద్యాలయాల్లో పోస్ట్ గ్రాడ్యుయేట్ (పీజీ) ప్రవేశాల కోసం నిర్వహించే టీజీ సీపీజీఈటీ-2026 షెడ్యూల్‌ను కన్వీనర్ ఆచార రాజేందర్ కట్ల శుక్రవారం విడుదలచేశారు. జూలై 8 నుంచి 15 వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన కేంద్రాల్లో ప్రతిరోజూ మూడు సెషన్లలో కంప్యూటర్ ఆధారిత పరీక్ష నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు.

## బీసీ బాలికల హాస్టల్ ఎత్తేశారు



విశ్వంభర, శాయంపేట : శాయంపేటలో సొంత భవనంలో ఎన్నో ఏళ్లుగా కొనసాగిన బీసీ బాలికల హాస్టల్‌ను ఎత్తేశారు. విద్యా సంవత్సరం ప్రారంభమైనా అడ్మిషన్లు తీసుకోకుండా, కళాశాల హాస్టల్‌గా అప్‌గ్రేడ్ చేసి హనుమకొండకు తరలించారు. దీంతో స్థానిక నిరుపేద విద్యార్థినులు నష్టపోతున్నారు. ఇన్నాళ్లు నాలుగో తరగతి నుంచి పదో తరగతి బాలికలకు వసతి కల్పించారు. ఇక్కడి వార్డెన్‌కు ఇటీవల బదిలీల్లో మహబూబాబాద్‌కు బదిలీ కాగా, మరో వార్డెన్ విధుల్లో చేరారు. గతేడాది శాయంపేటలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న సుమారు 30 మంది బాలికలకు ఇక్కడ వసతి కల్పించారు. స్కూల్ పిల్లలు హాస్టల్‌కు రావడం లేదని కాలేజీ హాస్టల్‌గా అప్‌గ్రేడ్ చేస్తున్నట్లు కమిషనరేట్ నుంచి ఆదేశాలు వచ్చాయని వార్డెన్ రజిత తెలిపారు. హనుమకొండలో బిల్డింగ్ చూస్తున్నారని, దొరకగానే ఇక్కడి నుంచి తరలిస్తామని, అక్కడ ఇంటర్ నుంచి పీజీ వరకు బీసీ బాలికల హాస్టల్ కొనసాగుతుందని వివరించారు.

ప్రజా విశ్వంభర V3 NEWS

# మత్తు పదార్థాల నిర్మూలనలో ప్రజలందరూ భాగస్వాములు కావాలి: డీసీపీ రామ్‌రెడ్డి

## అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గోదావరిఖనిలో మానవహారం



విశ్వంభర, గోదావరిఖని: గంజాయి, ఇతర మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని పెద్దపల్లి డీసీపీ రామ్‌రెడ్డి అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గోదావరిఖని మున్సిపాలిటీ జంక్షన్ వద్ద పోలీసులు విద్యార్థులతో కలిసి మాదకద్రవ్యాల వ్యతిరేక మానవహారం నిర్వహించారు. రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు గోదావరిఖని వన్‌టౌన్ సీఐలు ఇంద్రసేనారెడ్డి, అఫ్జలొద్దీన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి డీసీపీ బి. రామ్‌రెడ్డి, గోదావరిఖని ఏసీపీ రమేష్ ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులతో కలిసి మానవహారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏసీపీ రమేష్ మాట్లాడుతూ గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు బానిసలైన వారిని నేరస్తులుగా కాకుండా బాధితులుగా చూడాల్సిన అవసరం ఉందన్నారు. వ్యసనానికి గురైన వారికి చికిత్స, కౌన్సెలింగ్, పునరావాసం కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా డీ-అడిక్షన్ సెంటర్లను ఏర్పాటు చేసిందని తెలిపారు. గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాలకు అలవాటు పడిన వారిని గుర్తించిన వెంటనే పోలీసులకు సమాచారం అందిస్తే సంబంధిత ఆసుపత్రులు, డీ-అడిక్షన్ కేంద్రాలకు తరలించి అవసరమైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. వ్యసనాన్ని శిక్షల ద్వారా కాకుండా చికిత్స ద్వారా అధిగమించవచ్చని పేర్కొన్నారు. డీసీపీ బి. రామ్‌రెడ్డి మాట్లాడుతూ అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని జూన్ 22 నుంచి 26 వరకు నిర్వహించిన అవగాహన కార్యక్రమాల్లో భాగంగా గోదావరిఖని సబ్‌డివిజన్‌లో మానవహారం నిర్వహించినట్లు తెలిపారు. తెలంగాణను గంజాయి, మాదకద్రవ్యాల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలనే ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా గత ఆరు నెలలుగా పోలీసులు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. డ్రగ్స్, గంజాయి వినియోగం లేదా విక్రయాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే డయల్-100 లేదా 1908కు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సమాజాన్ని, ముఖ్యంగా యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడేందుకు ప్రతి పౌరుడు బాధ్యతతో వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు మనోహర్, అనూష, ఉపాధ్యాయులు, విద్యార్థినీ-విద్యార్థులు, ప్రజలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమం సందర్భంగా కొంతమంది వాహనదారులకు స్వల్ప అసౌకర్యం కలిగినప్పటికీ సహకరించినందుకు పోలీసులు కృతజ్ఞతలు తెలిపారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి

## బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య



విశ్వంభర, విద్యానగర్ : ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని యథాతథంగా అమలు చేసి రూ.8 వేల కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య హెచ్చరించారు. హైదరాబాదు విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో శుక్రవారం జరిగిన 14 బీసీ కుల సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఫీజు బకాయిలు విడుదల కాకపోవడంతో ఇంజినీరింగ్, ఫార్మసీ, డిగ్రీ, పీజీ తదితర కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులకు కళాశాల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని తెలిపారు. దీంతో ఉద్యోగాలు, విదేశాల్లో ఉన్నత విద్య అవకాశాలు వచ్చినా వేలాది మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని అన్నారు. ప్రభుత్వం తరచూ కొత్త జీవోలు జారీ చేయడంతో విద్యార్థులు, తల్లిదండ్రుల్లో అయోమయం నెలకొందని విమర్శించారు. ఇంజినీరింగ్ కౌన్సెలింగ్‌లో బీసీ, ఈబీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థుల నుంచి ముందస్తు ఫీజులు వసూలు చేయకుండా గత 18 ఏళ్లుగా అమలులో ఉన్న విధానాన్నే కొనసాగించాలని కోరారు. జీవోలు 8, 9పై స్పష్టత ఇవ్వడంతో పాటు ఫీజు రీయింబర్స్ మెంట్ నిధులను నేరుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇప్పటికే భారీగా అప్పులు చేసిన నేపథ్యంలో 14 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుతో నిర్లక్ష్యంగా వ్యవహరించ రాదని ఆర్. కృష్ణయ్య అన్నారు. సమస్యను వెంటనే పరిష్కరించకపోతే జులైలో రాష్ట్రవ్యాప్తం గా భారీ ఉద్యమాలు చేపడతామని హెచ్చరిం చారు. ఈ నెల 30న రాష్ట్రవ్యాప్తంగా తరగతుల ను బహిష్కరించి కలెక్టరేట్లు, ఆర్డీవో, ఎంఆర్ఓ కార్యాలయాలను ముట్టడించాలని 14 బీసీ కుల సంఘాలు సమావేశంలో తీర్మానించాయి. ఈ కార్యక్రమంలో: రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం వెంకటేష్, రాష్ట్ర బీసీ యువజన సంఘం అధ్యక్షుడు జిల్లపల్లి అంజి, రాష్ట్ర బీసీ కులాల ఐక్యవేదిక అధ్యక్షుడు అనంతయ్య, రాష్ట్ర బీసీ ఎస్సీ ఎస్టీ విద్యార్థి హాస్టల్ సంఘం అధ్యక్షుడు మోదీ రాందేవ్, బర్క కృష్ణ, మున్నారం నాగరాజు పాల్గొన్నారు.

# వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్న జీవీఆర్ అకాడమీ

## 36 సెకన్లలో 26 యాపిల్స్ బ్రేక్ చేసి ప్రపంచ రికార్డు



విశ్వంభర, హైదరాబాద్: అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా కాచిగూడలోని జీవీఆర్ కరాటే అకాడమీ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇంటర్నేషనల్‌లో చోటు దక్కించుకుంది. అకాడమీ వ్యవస్థాపకులు, డైరెక్టర్ డాక్టర్ జి.ఎస్. గోపాల్ రెడ్డి తన శిష్యులు భార్గవసాయి, ప్రణీత్, నైతిక్ రెడ్డి, సంజన, తన్వి, చిన్మయి ప్రియ సహకారంతో కేవలం 36 సెకన్లలో ఆరుగురు విద్యార్థుల తలపై ఉంచిన 26 యాపిల్స్‌ను హ్యాండ్ చాప్స్‌తో బ్రేక్ చేసి ప్రపంచ రికార్డు నెలకొల్పారు. వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇంటర్నేషనల్ ఇండియా చీఫ్ కో-ఆర్డినేటర్ బింగి నరేందర్ గౌడ్ రికార్డును ధ్రువీకరించి గోపాల్ రెడ్డి, విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేశారు. మాదకద్రవ్యాల వ్యతిరేక సందేశంతో ఈ రికార్డును నెలకొల్పడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు మహాలక్ష్మి రామన్ గౌడ్, కన్నె ఉమా రమేష్ యాదవ్, డాక్టర్ ఎ. కృష్ణారెడ్డి, కోట్ల నిరంజన్ రెడ్డి, అకాడమీ బ్లాక్‌బెల్ట్‌లు, విద్యార్థులు, తల్లిదండ్రులు, క్రీడాభిమానులు పాల్గొని రికార్డు గ్రహీతలను అభినందించారు. ఈ సందర్భంగా యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి క్రీడలు, క్రమశిక్షణ, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని జీవీఆర్ కరాటే అకాడమీ పిలుపునిచ్చింది.

### తక్కువ ధరకే బంగారం అంటూ మోసం

# ఓల్డ్ సిటీ గోల్డ్ మ్యాన్ సూర్యాభాయ్ అరెస్ట్



విశ్వంభర, హైదరాబాద్ :హైదారాబాద్ : సీఎం రేవంత్ రెడ్డికి అత్యంత సన్నిహితుడిని అని, హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌కు ప్రాణ స్నేహితుడిని అని చెప్పుకొని లక్షల రూపాయలు వసూలు చేసి మోసాలకు పాల్పడిన సూర్యాభాయ్‌ని పోలీసులు అరెస్ట్ చేశారు. ఒళ్లంతా బంగారం ధరించి గోల్డ్ మ్యాన్ సూర్యాభాయ్‌గా చెప్పుకుంటూ తక్కువ ధరకు స్వచ్ఛమైన బంగారం ఇప్పిస్తానని డబ్బులు తీసుకొని ముఖం చాటేసేవాడు. డబ్బులిచ్చి నెలలు గడుస్తున్నా బంగారం ఇవ్వలేదని ప్రశ్నించిన వారిపై ఎదురుతిరిగి బెదిరించేవాడు. దీంతో మోసపోయామని గ్రహించి బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసును నారాయణగూడ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేసినట్లు అత్తాపూర్ ఇన్స్పెక్టర్ నాగేశ్వరరావు తెలిపారు.

### ఎస్ఐఆర్ ఎన్యూమరేషన్ ఫారాలు

# ఉర్దూలో కూడా ప్రచురించాలి : ఎండీ యాకూబ్ పాషా



విశ్వంభర, హైదరాబాద్ : హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా బీఎల్‌ఓలు ఓటర్లకు పంపిణీ చేస్తున్న ఎన్యూమరేషన్ ఫారాలను ఉర్దూ భాషలో కూడా అందుబాటులో ఉంచాలని మైనార్టీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎండీ యాకూబ్ పాషా శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో తెలుగుతో పాటు ఉర్దూ కూడా అధికారిక ద్వితీయ భాష అయినప్పటికీ, ఎన్నికల కమిషన్ ఎన్యూమరేషన్ ఫారాలను ఉర్దూలో ముద్రించకపోవడం లక్షలాది ఉర్దూ మాట్లాడే ఓటర్లకు ఇబ్బందులు కలిగిస్తోందని అన్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఆంగ్ల భాషలో, రాష్ట్రంలోని మిగతా ప్రాంతాల్లో తెలుగులో మాత్రమే ఫారాలను అందిస్తున్నట్లు సమాచారం ఉందని పేర్కొన్నారు. ఉర్దూ మాతృభాషగా ఉన్న వృద్ధులు, నిరక్షరాస్యులు, సాధారణ ప్రజలు ఫారాలను సరిగా అర్థం చేసుకుని పూరించడంలో ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రజాస్వామ్యంలో ప్రతి అర్హుడైన ఓటరికి తన భాషలో సేవలు అందించడం ఎన్నికల కమిషన్ బాధ్యత అని పేర్కొన్నారు. అందువల్ల ఎన్నికల కమిషన్ వెంటనే ఉర్దూ భాషలో కూడా ఎన్యూమరేషన్ ఫారాలను ముద్రించి పంపిణీ చేయాలని అలాగే ఉర్దూ మాట్లాడే ప్రాంతాల్లో ఉర్దూ తెలిసిన సిబ్బందిని నియమించి ఓటర్లకు అవసరమైన సహాయం అందించాలని యాకూబ్ పాషా కోరారు. భాషా సమానత్వాన్ని గౌరవిస్తూ ప్రతి ఓటరికి సులభంగా అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఎన్నికల కమిషన్ కు లేఖ రాయనున్నట్లు యాకూబ్ పాషా తెలిపారు.

# పిడుగు పడి యువకుడు మృతి



విశ్వంభర, సంగారెడ్డి : సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం వెంకటాపూర్ గ్రామంలో శుక్రవారం విషాదం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన చింతకుంట అనిల్ కుమార్ (24), తండ్రి బుచ్చయ్య ఎడ్లను మేతకు తీసుకెళ్లగా శుక్రవారం మధ్యాహ్నం సుమారు 1:45 గంటలకు నడిమి చెరువు వద్ద పిడుగు పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన సమయంలో అనిల్ కుమార్‌తో పాటు ఉన్న అతని బావమరిది సిద్ధార్థ్ తీవ్రంగా గాయపడగా, వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# కుక్కల దాడితో 36 గొర్రెల మృతి



విశ్వంభర, గుండాల: యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం అనంతారం గ్రామంలో కుక్కల దాడిలో 36 గొర్రెలు మృతి చెందడంతో గొర్రెల కాపరి ఇట్టబోయిన యాదగిరి తీవ్ర ఆవేదనకు గురయ్యాడు. జీవనాధారమైన గొర్రెలను కోల్పోయిన బాధితుడిని పరామర్శించేందుకు కాంగ్రెస్ నాయకులు ఘటనాస్థలానికి చేరుకుని తక్షణ ఆర్థిక సహాయం అందజేశారు. విషయం తెలుసుకున్న ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య స్థానిక నాయకులకు ఆదేశాలు జారీ చేయగా, ఆలేరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఈరసారపు యాదగిరి గౌడ్, కాంగ్రెస్ నాయకుడు అండెం సంజీవరెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మానవతా దృక్పథంతో స్పందించిన ఈరసారపు యాదగిరి గౌడ్ రూ.20 వేల, అండెం సంజీవరెడ్డి రూ.10 వేల చొప్పున మొత్తం రూ.30 వేల తక్షణ ఆర్థిక సహాయాన్ని అందించారు. అలాగే ప్రభుత్వ పరంగా కూడా బాధితుడికి తగిన నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఇమ్మడి దశరథ గుప్తా, మాజీ ఎంపీపీలు నూనెముంతల వెంకటేశ్వర్లు, సంగీ వేణుగోపాల్ యాదవ్, మాజీ జెడ్పీటీసీ గోలుకొండ యాదగిరి, సర్పంచులు తాన్యా నారాయణస్వామి, వల్లాల రమేష్, కాంగ్రెస్ నాయకులు ఏలూరి రాంరెడ్డి, చిన్నం ప్రకాష్, దార సైదులు, ఆంజనేయులు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# మియాపూర్ సీఐ శివప్రసాద్‌పై బదిలీ వేటు

విశ్వంభర, హైదరాబాద్ : మియాపూర్ సీఐ శివప్రసాద్‌పై బదిలీ వేటు పడింది. సివిల్ వివాదంలో జోక్యం చేసుకున్నారనే ఆరోపణలతో శివప్రసాద్‌ను బదిలీ చేసి, సైబరాబాద్ సీపీ కార్యాలయానికి సీపీ రమేష్ రెడ్డి అటాచ్ చేశారు. ఒక ప్రైవేట్ హాస్పిటల్ భూ వివాదంలో నిబంధనలకు విరుద్ధంగా జోక్యం చేసుకున్నట్లు ఆరోపణలు రావడంతో ఈ చర్య తీసుకున్నారు. పోలీసులు సివిల్ వ్యవహారాల్లో జోక్యం చేసుకోవద్దని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు.

# తోల్కట్టలో మొహర్రం పీర్ల ఉత్సవం



విశ్వంభరా, మొహీనాబాద్: తోల్కట్ట గ్రామంలో మొహర్రం పీర్ల ఉత్సవం మత సామరస్యానికి ప్రతీకగా, అంగరంగ వైభవంగా జరిగింది. గ్రామంలోని అన్ని వర్గాల ప్రజలు పెద్దా, చిన్నా తేడా లేకుండా ఐకమత్యంతో, ఉత్సాహంగా మొహర్రం ఊరేగింపులో పాల్గొన్నారు. గ్రామ వీధుల గుండా సాగిన పీర్ల ఊరేగింపు భక్తి, సంప్రదాయం, సోదరభావానికి నిదర్శనంగా నిలిచి కన్నుల పండుగగా జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు బానూరు శివశంకర్ గౌడ్, సర్పంచ్ ఎం. రజిత రవీందర్, ఉప సర్పంచ్ ఇనాయత్, మాజీ సర్పంచ్ కనకమామిడి శ్రీనివాస్, తోల్కట్ట వార్డు సభ్యులు, యువకులు, మహిళలు, పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొని ఉత్సవాన్ని విజయవంతం చేశారు.

# రాజకీయ లబ్ధి కోసం ప్రభుత్వంపై విమర్శలు తగవు

## : సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్



విశ్వంభర, శంషాబాద్: రాజకీయ లబ్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌పై విమర్శలు చేయడం సరికాదని నర్కుడ గ్రామ సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్ అన్నారు. గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నర్కుడలో వంతెన నుంచి దేవాలయం వరకు రోడ్డు నిర్మాణంలో కొంత ఆలస్యం జరిగిన మాట వాస్తవమేనని, అయితే దీనిని రాజకీయాలకు వాడుకోవడం తగదన్నారు. గత ప్రభుత్వ హయాంలో రహదారుల అభివృద్ధిని నిర్లక్ష్యం చేసిన ప్రతిపక్ష నాయకులు ఇప్పుడు రాస్తారోకోలు నిర్వహించడం విడ్డూరమని విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఆర్అండ్‌బీ అధికారులతో మాట్లాడగా, రోడ్డు పనులు పది రోజుల్లో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ప్రజలను రెచ్చగొట్టే రాజకీయాలకు బదులుగా గ్రామ అభివృద్ధికి సహకరించాలని ప్రతిపక్ష నాయకులకు సూచించారు. ఈ సమావేశంలో ఉపసర్పంచ్ శేఖర్ ముదిరాజ్, వార్డు సభ్యులు, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఉరేసుకుని వార్డ్ మెంబర్ మృతి



విశ్వంభర, సిద్దిపేట: ఓ వార్డు మెంబర్, మాజీ ఉప సర్పంచ్ ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన కొండపాక మండలం దుద్దెడ గ్రామంలో శుక్రవారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గుండెల్లి ఆంజనేయులు రోజు మాదిరిగానే ఉదయం వాకింగ్ కోసం ఇంటి నుంచి బయటకెళ్లాడు. ఎంతకీ తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు పలుచోట్ల వెతికారు. చివరకు గ్రామ శివారులోని తన ఫామ్ హౌస్ లో ఉరేసుకున్నట్టు గుర్తించారు. గ్రామస్తులు, కుటుంబసభ్యులు ఘటన స్థలానికి చేరుకోవడంతో అప్పటికే మృతిచెందాడు. ఆంజనేయులు మృతితో ఆయన భార్య, కూతురు, వృద్ధులైన తల్లిదండ్రులు, అతని చెల్లెలు బోరున విలపించారు. కుటుంబసభ్యుల రోదనలు అందరినీ కంటతడి పెట్టించాయి. సమాచారం అందుకున్న రూరల్ సీఐ విద్యాసాగర్, త్రీ టౌన్ సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిద్దిపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆంజనేయులు మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, బంధువులు జిల్లా కేంద్రంలోని భారత్ నగర్ లో రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని పోలీసులు వారిని శాంతింపజేశారు.

# మృతుల కుటుంబాలకు గొంగిడి సునీత పరామర్శ



విశ్వంభర, గుండాల : గుండాల మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన కుటుంబాలను మాజీ ప్రభుత్వ విప్, ఆలేరు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇంచార్జ్ గొంగిడి సునిత మహేందర్ రెడ్డి పరామర్శించారు. మాసాన్‌పల్లి గ్రామ సర్పంచ్ పంగ జయసుధ మామ, పంగ సతీష్ రెడ్డి తండ్రి మోహన్ రెడ్డి ఇటీవల మృతి చెందడంతో వారి నివాసానికి వెళ్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. తర్వాత రామారం గ్రామానికి చెందిన అట్ల నర్సిరెడ్డి తల్లి మృతి చెందగా వారి కుటుంబాన్ని, అలాగే పెద్దపడిశాల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు చల్లపల్లి రమేష్ తండ్రి మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎండీ ఖలీల్, మద్దుల బాల్‌రెడ్డి, మచ్చ చెన్నారెడ్డి, అట్ల నర్సిరెడ్డి, పంగ రామ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, అట్ల రంజిత్‌రెడ్డి, చుంచు యాదగిరి తదితర నాయకులు, పాల్గొన్నారు.

# శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి ఆకారపు గుడిలో అన్నవితరణ



విశ్వంభర, హనుమకొండ : వరంగల్ స్టేషన్ రోడ్ లోని శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి గుడిలో ది వరంగల్ డిస్ట్రిక్ ఫర్టిలైజర్స్ ఫెస్టిసైడ్స్, అండ్ సీడ్స్ డీలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి వారికి ఘటాభిషేకం వేద పండితులచే ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు మహా అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు శివకుమార్, వరంగల్ జిల్లా ఫెర్టిలైజర్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ కేదారి మీడియాతో మాట్లాడుతూ, శ్రీ కాశీ విశ్వేశ్వర ఆలయంలో ఘటాభిషేకం నిర్వహించడంతో పాటు అన్నవితరణ కార్యక్రమం నిర్వహించామని, ముఖ్యంగా రైతులకు వర్షాకాలం వచ్చినప్పటికీ వర్షాలు రాకపోవడంతో ఎంతో మనోవేదనకు గురి అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఆకారపు హరీష్,ఫెర్టిలైజర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగుర్ల వెంకన్న, ప్రధాన అర్చకులు శివకుమార్,రాజేందర్ రెడ్డి ఆర్గనైజింగ్ సెక్రటరీ పైడి, లకూటి గోపి, ఆకుల అరవిందర్, రాజేశ్వరరావు, సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# ఓపెన్ జిమ్‌లతో ఆరోగ్యవంతమైన సమాజమే లక్ష్యం: కిషన్ రెడ్డి



విశ్వంభర, హైదరాబాదు : ప్రజల్లో ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడమే లక్ష్యంగా సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గంలోని పలు పార్కుల్లో ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి తెలిపారు. శుక్రవారం అంబర్‌పేట్, ముషీరాబాదు, సనత్‌నగర్ నియోజకవర్గాల పరిధిలోని పలు ప్రాంతాలను సందర్శించి ఓపెన్ జిమ్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆధునిక జీవనశైలి, మానసిక ఒత్తిడి, కలుషితమైన గాలి, నీరు, ఆహారపు అలవాట్లు ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని అన్నారు. ప్రతిరోజూ కనీసం 30 నిమిషాలు వ్యాయామం చేయడం, యోగా అలవాటు చేసుకోవడం ద్వారా అనేక అనారోగ్య సమస్యలను నివారించవచ్చని సూచించారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రతిపాదించిన 'ఫిట్ ఇండియా - హెల్త్ ఇండియా' లక్ష్యానికి ప్రజలు మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. రామ్‌గోపాల్‌పేట్ డివిజన్‌లోని జవహర్ నగర్ కాలనీ పార్కు, బేగంపేట్ డివిజన్‌లోని మోతీలాల్ నెహ్రూ నగర్ పార్కు, నెహ్రూ పార్కు ఎదురుగా ఉన్న ఆయుర్వేద పార్కులో ఓపెన్ జిమ్‌లను ప్రారంభించారు. ఈ జిమ్‌లు యువత, మహిళలు, వయోవృద్ధులు ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఉపయోగపడతాయని తెలిపారు. పార్కుల అభివృద్ధితో పాటు ప్రజలకు మెరుగైన ఆరోగ్య సౌకర్యాలు అందించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేయాలన్న మీడియా ప్రతినిధుల ప్రశ్నకు స్పందిస్తూ, తగిన స్థలం ఉన్న ప్రభుత్వ పాఠశాలలు ప్రతిపాదనలు పంపితే అక్కడ కూడా ఈ సౌకర్యాలను ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో: స్థానిక నాయకులు కార్యకర్తలు కాలనీవాసులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ చీరల పంపిణీతో మహిళలను మోసం చేస్తున్న కాంగ్రెస్



విశ్వంభర, కొండాపూర్ : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో మహిళలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, ఇతర హామీలను వెంటనే అమలు చేయాలని శేరిలింగంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు, మాజీ కార్పొరేటర్ బొబ్బా నవత రెడ్డి డిమాండ్ చేశారు. ఇందిరా మహిళా శక్తి పథకం కింద పంపిణీ చేస్తున్న రూ.300 చీరలతో మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మహాలక్ష్మి పథకంలో భాగంగా అత్తకు రూ.4,000, కోడలికి రూ.2,500 ఆర్థిక సాయం, ఇందిరమ్మ ఇళ్లు, పెళ్లి కానుకగా తులం బంగారం, విద్యార్థినులకు ఉచిత స్కూటీలు, పెరిగిన పెన్షన్ల ఎన్నికల హామీలు ఇప్పటికీ అమలు కాలేదని విమర్శించారు. మహిళలను కోటీశ్వరులను చేస్తామని చెప్పిన ప్రభుత్వం హామీలను విస్మరించి కేవలం ఇందిరమ్మ చీరల పంపిణీతో మభ్యపెట్టేందుకు చూస్తుందన్నారు. మియాపూర్ సర్కిల్ పరిధి చందానగర్ డివిజన్ కైలాష్ నగర్ కాలనీలో మహిళా భవన నిర్మాణం కోసం కేటాయించిన సుమారు 4 వేల గజాల ప్రభుత్వ భూమిని విద్యుత్ శాఖ ఆక్రమించిందని నవతరెడ్డి ఆరోపించారు. విద్యుత్ శాఖ భూమి ఆక్రమణపై స్థానిక ఎమ్మెల్యే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు

# చెరువు షట్టర్ల మరమ్మతులపై ఇరిగేషన్ అధికారుల అలసత్వం



విశ్వంభర,చుంచుపల్లి : వర్షాకాలం ప్రారంభమైన వేళ చెరువుల్లో నీటిని నిల్వ చేసి రైతులకు సాగునీరు అందించాల్సిన సమయంలో చెరువుల తూముల షట్టర్లు పాడైపోయినా ఇరిగేషన్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెనగడపలోని కృష్ణారాయుడు చెరువు, ఎర్ర చెరువు, పెద్ద చెరువు కింద సుమారు 900 ఎకరాలకు పైగా ఆయకట్టు ఉంది. ఈ మూడు చెరువుల నుండే ప్రతి ఏడాది రెండు పంటలకు సాగునీరు అందుతుండడంతో పాటు భూగర్భ జలాలు కూడా సమృద్ధిగా నిల్వ ఉండి బోర్లు, మోటార్లకు నీరు లభిస్తుందని రైతులు చెబుతున్నారు. అయితే కొన్ని నెలలుగా ఈ మూడు చెరువుల తూముల షట్టర్లు పూర్తిగా దెబ్బతినడంతో చెరువుల్లో నీటిని నిల్వ చేయడం కష్టంగా మారిందని, వర్షపు నీరు వృథాగా పోతుందనే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు శాశ్వత చర్యలు చేపట్టలేదని రైతులు విమర్శిస్తున్నారు. ఈ విషయాన్ని ఇరిగేషన్ అధికారులు కూడా ధృవీకరించారు. షట్టర్ల మరమ్మతుల కోసం రూ.1.10 లక్షల అంచనా వ్యయంతో టెండర్లు పిలిచినా ఎవరూ ముందుకు రాలేదని అధికారులు పేర్కొంటున్నారు. దీంతో పనులు నిలిచిపోయాయని చెబుతున్నారు. అదే విధంగా ఇది సింగరేణి ప్రభావిత ప్రాంతం కావడంతో జీకేఓసీ (+ఖ రాజ) నుండి విడుదల చేసే నీటిని కూడా ఈ చెరువుల్లోకి మళ్లిస్తుంటారు. షట్టర్ల సమస్యపై సింగరేణి అధికారులు కూడా పలుమార్లు ప్రస్తావించినట్లు ఇరిగేషన్ ఏఈ ప్రసాద్‌రావు తెలిపారు. అయితే అధికారులు టెండర్ల పేరుతో కాలయాపన చేయకుండా ప్రత్యేక చర్యలు తీసుకుని తక్షణమే షట్టర్ల మరమ్మతులు పూర్తి చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా ఇరిగేషన్ శాఖ స్పందించి చెరువుల్లో నీరు నిల్వ ఉండేలా చర్యలు చేపట్టకపోతే రాబోయే సాగు సీజన్‌లో రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# తెలంగాణలో మరోసారి ముల్కీ ఉద్యమం వచ్చే అవకాశం

జి దేవీప్రసాద్



విశ్వంభర, హైదరాబాద్ :హైదరాబాద్ : తెలంగాణ రిజర్వేషన్లను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదని కార్పొరేషన్ మాజీ చైర్మన్ జి .దేవీప్రసాద్ అన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే మరోసారి ముల్కీ ఉద్యమం వచ్చే అవకాశముందని హెచ్చరించారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ నేత భుజంగ రావు , టీజీపీఎస్సీ మాజీ సభ్యురాలు సుమిత్రానంద్ , బీసీ కమిషన్ మాజీ సభ్యురాలు ఉపేంద్ర చారితో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ సర్కార్ కొత్తకొత్త నిబంధనలు తీసుకు రావడం వల్ల తెలంగాణ యువతకు తీరని అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. 3 యేండ్లు తెలంగాణ రాష్ట్రంలో బీటెక్ ద్వివష్ట్ర చదివితే స్థానికులు ఎలా అవుతారని ప్రశ్నించారు. తెలంగాణలో బీటె క్వార్తి చేసిన ఇతర రాష్ట్రాల వారు మొత్తం స్థానికులుగానే భావించాల్సి వస్తుందని వెల్లడించారు. ఆంధ్రా ప్రాంతానికి చెందిన పల్లా నిషాంత్ కేసు తెలంగాణ వారికి అన్యాయం జరుగుతుందన్నారు. తీర్పు ఇచ్చిన జడ్జిని తప్పు పట్టడం లేదని, పబ్లిక్ సర్వీస్ కమిషన్ సరైన వాదనలు వినిపించడంలో విఫలం చెందడం వల్లే సమస్య వస్తుందని వివరించారు. సాంకేతక సమస్యలతో ఆదిలాబాద్ కొమరం భీం జిల్లా లాంటి ప్రాంతాల నిరుద్యోగులు ఉద్యోగాలు పొందలేక పోయారని వెల్లడించారు. ఈ అంశాలను గమనించి 95 శాతం ఉద్యోగాలు స్థానికులకే దక్కేలా కేసీఆర్ కృషి చేశారని , 1 వ తరగతి నుంచి 7 వ తరగతి వరకు తెలంగాణలో చదువుకున్న వారిని స్థానికులుగా గుర్తించాలని నిర్ణయం తీసుకున్నారని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రాంతానికి చెందిన విద్యార్థులు ఇతర రాష్ట్రాల్లో చదివితే స్థానికులుగా గుర్తించడం లేదని పేర్కొన్నారు. స్థానిక అంశం తెలంగాణలో మళ్లీ అలజడులు జరిగేలా ఉందని అన్నారు.

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సరైన రీతిలో కౌంటర్ దాఖలు చేయలేదని, జీఏడీ అధికారులు, చీఫ్ సెక్రటరీ సమావేశం నిర్వహించి దీని పై న్యాయ పోరాటం చేయాలని సూచించారు. లేకపోతే ముల్కీ రూల్ ఉద్యమం మళ్లీ వచ్చే అవకాశం ఉందని జోయం చెప్పారు. తెలంగాణ ఉద్యోగులకు బ్యాంక్ అకౌంట్ ఉన్నవారికి బీమా పథక సదుపాయం ఇప్పటికే ఉందని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభలో ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తానని ఎంతో ఆశతో ఎదురుచూశారని, సీఎం వారిని నిరాశపరిచారని తెలిపారు. ఆరు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, సీపీఎస్ గురించి మాట్లాడనే లేదని తెలిపారు. ఈ ప్రభుత్వం ఉద్యోగులను మోసం చేస్తుందని ఆరోపించారు. ప్రభుత్వ విద్యా ఉంటుందా , కనుమరుగు అవుతుందో అనుమానం కలుగుతుందని బీఆర్ఎస్ నాయకుడు భుజంగ రావు తెలిపారు. నాడు కేసీఆర్ విద్యా అవకాశాలు మెరుగు పరురగా రేవంత్ రెడ్డి నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు.

# 'ఓటర్లు ఎన్యుమరేషన్ ఫారాల్లో పూర్తి వివరాలు నమోదు చేయాలి'



విశ్వంభర, బూర్గంపహాడ్ : ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లు ఓటర్ల ఇంటికి వెళ్లిన సమయంలో ప్రతి ఓటరుకు అందజేసిన ఎన్యుమరేషన్ ఫారాల్లో పూర్తి వివరాలు నమోదు చేసి తిరిగి వారికి అందజేయాలని భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ ఓటర్లకు సూచించారు. శుక్రవారం బూర్గంపహాడ్ మండల పరిధిలోని పారిశ్రామిక వాడ సారపాకతో పాటు ఇరవెండి, మోతే పట్టీనగర్ గ్రామాల్లో పర్యటించి సర్ ప్రక్రియను ఆయన ప్రత్యేకంగా పరిశీలించారు. ఓటర్ల ఇంటికి వెళ్లి సర్ ప్రక్రియకు సంబంధించి అవగాహన కల్పించారు. సర్ ప్రక్రియ అంటే కేవలం ఓటర్ల జాబితా సవరణ మాత్రమే అని, అర్హులైన ప్రతిఒక్కరికీ ఓటుహక్కు కల్పించడానికి, జాబితాలో తప్పులు సరిదిద్దడం దీని ముఖ్య ఉద్దేశ్యమన్నారు. బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లు అందించిన ఎన్యుమరేషన్ ఫారాలు తీసుకుని కుటుంబంలో అర్హులైన ప్రతిఒక్కరి పూర్తి వివరాలు ఫారంలో నమోదు చేసి తిరిగి బీఎల్వోలకు అందించే సమయంలో రశీదు తీసుకోవాలన్నారు. సర్వే ద్వారా మరణించిన వారి పేర్లు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి వివరాలు, ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఉన్న డూప్లికేట్ ఓట్లను తొలగిస్తారన్నారు. ఇంటింటి సర్వేలో బూత్ స్థాయి అధికారులు నేరుగా ప్రతి ఓటరు ఇంటికి వెళ్లి ఈ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిం చాలన్నారు.

# వైభవంగా శ్రీ భవాని శంకర స్వామి ఆలయ వార్షికోత్సవం

విశ్వంభర, వీణవంక : వీణవంక మండలంలోని ఘన్ముక్ల గ్రామంలోని శ్రీ భవాని శంకర స్వామి దేవాలయంలో 22వ వార్షికోత్సవ సందర్భంగా స్వామివారికి శుక్రవారం కళ్యాణ మహోత్సవం, అన్నదానం, గ్రామం పురవీధుల గుండా శివపార్వతుల రథోత్సవం వైభవంగా సాగింది. ఆలయ చైర్మన్ జిన్నారపు శివకుమార్ ఆధ్వర్యంలో శ్రీ భవాని శంకర స్వామి ఆలయంలో ఉదయం 6 గంటలకు అఖండ దీపారాధన, గణపతి గౌరీ పూజ, స్వస్తి పూజ పుణ్య హవచనం, ధ్వజారోహణ, ఉదయం ఏడున్నర గంటలకు రుద్రభిషేకం, ఉదయం 9 గంటలకు రుద్ర హోమం, పూర్ణాహుతి, ఉదయం 11 గంటలకు శివపార్వతుల కళ్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం ఒంటిగంటకు అన్నదానం నిర్వహించారు. సాయంత్రం గ్రామ పురవీధుల గుండా ఉత్సవ మూర్తుల ఊరేగింపు ఘనంగా జరిగింది. ఉదయం నుండి సాయంత్రం వరకు భక్తులు రాకతో ఆలయం రద్దీగా మారింది. స్వామివారిని రకరకాల పుష్పాలతో ఘనంగా అలంకరించారు. నవగ్రహాల ఆరాధన, ధ్యానం, హోమాది జపాది కార్యక్రమాలను వేద బ్రాహ్మణ సన్నిధానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం సమయాన ఉత్సవ మూర్తులైన శివపార్వతులను గ్రామ పూర్వ వీధుల గుండా మహిళా భక్తుల కోలాట ముత్యాల నడుమ ఊరేగిస్తూ, భక్తులు కొబ్బరికాయలు కొడుతూ మొ క్కులు చెల్లించుకుని స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.


# మోరంపల్లిబంజర్ సంతలో నిబంధనలు బేఖాతర్



విశ్వంభర, బూర్గంపహాడ్ : బూర్గంపహాడ్ మండలంలో అతిపెద్ద సంతగా పేరున్న మోరంపల్లిబంజర్ సంతలో నిర్వాహకులు నిబంధనలు బేఖాతర్ చేస్తున్నారు. వారంలో బుధ, గురు, శుక్రవారాల్లో జరిగే పశువులు, కూరగాయల విక్రయాల్లో నిర్వాహకులు అధిక ధరలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు బాహాటంగా వినవస్తున్నాయి. సంత నిర్వాహకులు నిర్ణయించిన ధరల కంటే ఎక్కువ మొత్తంలో వ్యాపారుల నుండి వసూలు చేయడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. చిరువ్యాపారులు తమకు కేటాయించిన స్థలాలకు నిర్ణయించిన ధర కాకుండా అధికంగా ధర వసూలు చేస్తున్నారని దీంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు వ్యాపారం చేసినా తమకు రాని ఆదాయం ఈ అధిక వసూళ్లతో నష్ట పోతున్నామని వాపోతున్నారు. ధర వసూలు చేసినా తిరిగి రశీదులు కూడా ఇవ్వడం లేదని చిరు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారంలో మూడు రోజులు నడిచే ఈ సంతలో అధిక ధరలు వసూలు చేయడంతో పాటు పశువుల విక్రయాల్లో నిబంధనలను నిర్వాహకులు పట్టించుకోకుండా 13 శాల్తీలే లోడు చేయాల్సి ఉండగా అంతకంటే అ ఎక్కువ మొత్తంలో పశువులను వాహనాల్లో తరలించి అక్రమ రవాణాకు పాల్పడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. సంత నిర్వాహకులు వ్యవహరిస్తున్న తీరుపై పంచాయతీ అధికారులు సైతం నోరుమెదపకపోవడంతో సంతకు వచ్చే ప్రజలు, చిరు వ్యాపారులు తీవ్రంగా మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిర్ణయించిన ధర కంటే అధికంగా వసూళ్లు చేస్తున్న సంత నిర్వాహకులపై తగినచర్యలు తీసుకోవాలని ప్రజలు, చిరు వ్యాపారులు డిమాండ్ చేస్తున్నారు.

# ఓటర్ జాబితా ప్రత్యేక సవరణ పక్కగా నిర్వహించాలి

బాన్సువాడ ఆర్‌డీవో రవీందర్ రెడ్డి



విశ్వంభర, కోటగిరి: ఓటర్ జాబితా ప్రత్యేక సవరణ పక్కగా నిర్వహించాలని, ప్రతీ ఒక్కరూ సర్ కార్యక్రమాన్ని సహకరించాలని బాన్స్ వాడ ఆర్డీవో రవీందర్ రెడ్డి కోరారు. కోటగిరి, పొతంగల్ మండలాల్లో కొనసాగుతున్నసర్ సర్వేను ఆయన ఆకస్మికంగా సందర్శించి బీఎల్ఓలకు పలు సూచనలు చేశారు. అర్హులైన ప్రతీ ఒక్కరూ ఓటరు నమోదు చేసుకోవాలని కోరారు. జాబితాలో మార్పులు చేర్పులు చేసుకోవాలన్నారు. ఎన్యుమరేషన్ ఫాంలలో తప్పు లు లేకుండా జాగ్రత్తగా చూడాలన్నారు. ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం ఇంటింటా సర్వే వచ్చే నెల 24 వరకు కొనసాగుతుందని ఆయన తెలిపారు. ఎవరూ కూడా ఆందోళన చెందద్దని సూచించారు. ఓటర్ల వివరాల నమోదు ఆన్లైన్లో అప్లోడ్ అంశంపై బీఎల్ఓలకు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట కోటగిరి, పోతంగల్ తహసీల్దార్లు గంగాధర్, సందీప్, ఆర్ఐ సునీల్ రెడ్డి, ఐకేపీ సీసీ సాయి బాబా, స్థానిక సర్పంచులు, బీఎల్‌వోలు ఉన్నారు.

# మూడు తండాల్లో మొహర్రం ఉత్సవాలు



విశ్వంభర, టేకులపల్లి : కుల, మతాలకు అతీతంగా ప్రజలను ఒక్కచోట చేర్చి సోదర భావాన్ని పెంపొందించే పీర్ల పండుగ మూడు తండాలో మతసామరస్యానికి ప్రతీకగా నిలిచింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలంలోని మూడు తండా గ్రామంలో శుక్రవారం మొహర్రం సందర్భంగా పీర్ల పండుగను గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏడాది సంప్రదాయబద్ధంగా నిర్వహించే ఈ వేడుకల్లో చిన్నారుల నుంచి వృద్ధుల వరకు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పీరీలను గ్రామ వీధుల్లో ఊరేగిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించగా, భక్తులు మొక్కులు చెల్లించుకొని తమ కుటుంబాల సుఖసంతోషాలు, గ్రామ శ్రేయస్సు కోసం ప్రార్థనలు చేశారు. హిందూ, ముస్లింలు కలిసి నిర్వహించిన ఈ ఉత్సవాలు గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పాయి. ఈ కార్యక్రమంలో మూడ్ హుస్సేన్ నాయక్, మూడ్ రాజ్ కుమార్, నాగేశ్వరరావు, మూడ్ కృష్ణ, మూడ్ గణేష్, సుమన్, సుభాన్, పూజారి ఫౌజా పవన్, మహేష్, దయాకర్, రత్నశేఖర్ తదితరులు పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేశారు.

# 29న కోటమైసమ్మ ఆలయంలో వేలం పాటలు



విశ్వంభర, కారేపల్లి: ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం ఉసిరికాయలపల్లి కోటమైసమ్మ తల్లి ఆలయం ప్రాంగణంలో ఏడాది కాల పరిమితితో టెంట్ సామను అద్దెకు ఇవ్వడానికి, కొబ్బరి చిప్పల పోగుకు వేలం పాటను ఈ నెల 29న నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పర్స పట్టాభి రామారావు, ఈవో కె.వెంకటయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 1వ తేదీ నుండి 31జూన్ 2027 కాల పరిమితితో కోట మైసమ్మ తల్లి ఆలయ పరిసరాలలో టెంట్ సామనుల నిర్వహణ, కొబ్బరి చిప్పల పోగు చేసుకోవడానికి ఈ వేలం పాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టెంట్ హౌస్ నిర్వాహణ కోసం రూ.1 లక్ష, కొబ్బరి చిప్పల కోసం రూ.5 వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు. కొబ్బరి చిప్పల పోగుకు జాతర నిర్వాహక కాలంలో 20 రోజులు పాటు అవకాశం ఉండదని ఆ సమయంలో వేరే టెండర్ అమలులో ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని సమీప ప్రాంతవాసులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

# పలు కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే రాములు నాయక్ పరామర్శ



విశ్వంభర, కారేపల్లి: కారేపల్లి మండల పరిధిలోని విశ్వనాథపల్లి గ్రామంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సుతారి మేస్త్రి చిత్తలూరి వీరయ్య కుటుంబ సభ్యులను వైరా మాజీ ఎమ్మెల్యే లావుడియా రాములు నాయక్ శుక్రవారం పరామర్శించారు. అదేవిధంగా కారేపల్లికి చెందిన ఇందుర్తి సురేందర్ రెడ్డి, బీసీ కాలనీకి చెందిన తెలకలపల్లి శ్రీనివాస్ ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండగా వారి ఇండ్లకు వెళ్లి పరామర్శించారు. అనంతరం భాగ్యనగర్ తండా తదితర గ్రామాలలో పర్యటించారు. ఆయన వెంట మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ ముత్యాల సత్యనారాయణ, బీఆర్ఎస్ పార్టీ మాజీ మండల కార్యదర్శి అజ్మీర వీరన్న, ఇల్లెందు మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ వాంకుడోత్ నరేష్, బీఆర్ఎస్ నాయకులు పిల్లి వెంకటేశ్వర్లు, కోటి, రామ్ కిషోర్ నాయక్, కాకాటి సాయి, జహీర్, జూపల్లి అశోక్ పాల్గొన్నారు.

# సారపాక బసప్పక్యాంప్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన



విశ్వంభర, బూర్గంపహాడ్ : బూర్గంపహాడ్ మండల పరిధిలోని సారపాక బసప్పక్యాంప్‌లో ఎన్నో ఏళ్లుగా రహదారి లేకపోవడంతో వార్డు సభ్యులు బాలి కనకరత్నం చొరవతో సీసీ రోడ్డు మంజూరైంది. ఈ సీసీ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం సర్పంచ్ గుగులోత్ కిశోర్‌నాయక్ శంకుస్థాపన చేసి ప్రారంభించారు. గ్రామంలో రహదారులు, డ్రైనేజీలు నిర్మాణం చేపట్టడానికి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సహకారం అందిస్తున్నారని దీంతో ఈ అభివృద్ధి పనులు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కన్నెదారి రమేశ్, వార్డు సభ్యురాలు కనకరత్నం, మాజీ ఎంపీటీసీ బాలి శ్రీహరి, రత్నారెడ్డి, 13, 17, 4వ వార్డు సభ్యులు పోతిరెడ్డి నవ్య అశోక్, వారాల రామకృష్ణ, పిల్లి గౌరి, బసప్ప రమేష్, అరుణ్ ప్రసాద్, లాల్‌మహ్మద్, రాము, దారం వెంకట్రామిరెడ్డి, సయ్యద్ జహంగీర్, ఖాన్, శివ, ఉస్మాన్, డొంకన లకుమాదేవి, సుజాత, ప్రియాంక, సత్యవతి, నాగలక్ష్మి, ఫాతిమా పాల్గొన్నారు.

## 'నేను ఎవరితోనూ రిలేషన్‌లో లేను'..
# రూమర్లపై శృతి హాసన్ క్లారిటీ!

స్టార్ హీరోయిన్ శృతి హాసన్ వ్యక్తిగత జీవితం గురించి సోషల్ మీడియాలో తరచూ పలు వార్తలు వైరల్ అవుతుంటాయి. ముఖ్యంగా ఆమె రిలేషన్‌షిప్ గురించి గత కొంతకాలంగా అనేక ఊహాగానాలు వినిపిస్తున్నాయి. తాజాగా ఈ ప్రచారాలపై స్వయంగా శృతి హాసన్ స్పందిస్తూ పూర్తి క్లారిటీ ఇచ్చారు. ఇటీవల ఇన్‌స్టాగ్రామ్‌లో అభిమానులతో ముచ్చటించిన శృతి హాసన్‌కు ఆమె వ్యక్తిగత జీవితానికి సంబంధించిన పలు ప్రశ్నలు ఎదురయ్యాయి. ఈ సందర్భంగా ఓ అభిమాని ప్రస్తుతం మీరు ఎవరితోనైనా రిలేషన్‌షిప్‌లో ఉన్నారా? అని ప్రశ్నించగా, శృతి ఎలాంటి సందేహాలకు తావులేకుండా సమాధానం ఇచ్చారు. నేను ప్రస్తుతం ఎవరితోనూ, ఎలాంటి రిలేషన్‌షిప్‌లో లేను అని శృతి హాసన్ స్పష్టం చేశారు. దీంతో ఆమె డేటింగ్ గురించి గత కొంతకాలంగా సోషల్ మీడియాలో వస్తున్న ప్రచారాలకు ఫుల్ స్టాప్ పడినట్లైంది. అలాగే మరో అభిమాని, నటిగా కాకపోతే ఏ వృత్తిని ఎంచుకునేవారని అడగగా, చిన్నపిల్లల మానసిక వైద్యురాలిగా (చైల్డ్ సైకాలజిస్ట్) మారాలనుకునేదానిని అని శృతి తెలిపారు. ఈ సమాధానం ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఒకప్పుడు తమిళం, తెలుగు, హిందీ భాషల్లో వరుస సినిమాలతో బిజీగా ఉన్న శృతి హాసన్ గత కొంతకాలంగా సినిమాల ఎంపికలో చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. తక్కువ ప్రాజెక్టులు చేస్తున్నప్పటికీ, తన అభిమానులతో మాత్రం సోషల్ మీడియా ద్వారా నిరంతరం టచ్‌లో ఉంటున్నారు. ఇటీవల రామ్ చరణ్ నటించిన 'పెద్ది' చిత్రంలో శృతి హాసన్ ప్రత్యేక పాటలో కనిపించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఇక హీరోయిన్‌గా ఆమె నటించనున్న 'సలార్ 2' చిత్రంపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమా షూటింగ్ ఈ ఏడాది చివర్లో ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. మొత్తానికి తన వ్యక్తిగత జీవితంపై వస్తున్న పుకార్లకు శృతి హాసన్ స్వయంగా స్పందించి క్లారిటీ ఇవ్వడంతో సోషల్ మీడియాలో ఈ వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి.





# ఒకే ఫ్రేమ్‌లో చిరు, నాగ్, వెంకీ.. ఖుష్బూ కూతురి పెళ్లిలో సందడి

ప్రముఖ నటి, రాజకీయ నాయకురాలు ఖుష్బూ సుందర్ ఇంట పెళ్లి సందడి నెలకొంది. ఆమె పెద్ద కుమార్తె అవంతిక వివాహం గోవాలో అత్యంత వైభవంగా జరిగింది. చెన్నైకి చెందిన వ్యాపారవేత్త శ్రవణ్ శ్రీనివాసన్‌తో అవంతిక వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. గోవాలోని ఒక విలాసవంతమైన రిసార్ట్‌లో జరిగిన ఈ వేడుకకు పలువురు సినీ, రాజకీయ రంగ ప్రముఖులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ పెళ్లి వేడుకకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ వివాహ వేడుకలో టాలీవుడ్ సీనియర్ హీరోలు చిరంజీవి, నాగార్జున, వెంకటేశ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ ముగ్గురు కథానాయకులు తమ సతీమణులు సురేఖ, అమల, నీరజలతో కలిసి హాజరయ్యారు. సంప్రదాయ వస్త్రధారణలో మెరిసిన ఈ తారలంతా నూతన దంపతులతో ఫొటోలు దిగి సందడి చేశారు. వీరితో పాటు బాలీవుడ్ నటులు అనిల్ కపూర్, జాకీ ష్రాఫ్, నటి త్రిష కూడా ఈ వేడుకలో పాలుపంచుకున్నారు. దీంతో 80, 90ల నాటి తారలంతా ఒకేచోట చేరిన అరుదైన దృశ్యం ఆవిష్కృతమైంది. ఖుష్బూకు టాలీవుడ్‌లోని ఈ ముగ్గురు అగ్ర హీరోలతో మంచి అనుబంధం ఉంది. 'కలియుగ పాండవులు' చిత్రంతో వెంకటేశ్, ఖుష్బూ ఇద్దరూ దాదాపు ఒకే సమయంలో కెరీర్ ప్రారంభించారు. ఆ తర్వాత నాగార్జునతో 'కెప్టెన్ నాగార్జున' చిత్రంలో ఆమె హీరోయిన్‌గా నటించారు. ఇక, చిరంజీవి నటించిన 'స్టాలిన్' సినిమాలో ఖుష్బూ ఆయనకు సోదరిగా కీలక పాత్ర పోషించారు. వృత్తిపరంగానే కాకుండా వ్యక్తిగతంగా కూడా వీరందరి మధ్య స్నేహబంధం కొనసాగుతోంది. వెండితెరపై ఒకరితో ఒకరు పోటీపడినా, నిజ జీవితంలో మంచి స్నేహితులుగా మెలిగే చిరు, నాగ్, వెంకీ.. తమ స్నేహితురాలి కుమార్తె వివాహంలో ఇలా ఒకే ఫ్రేమ్‌లో కనిపించడంతో అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



# వారణాసి అప్పటిలోగా షూటింగ్ పూర్తవుతుందన్న జక్కన్న!

సూపర్ స్టార్ మహేశ్ బాబు, ప్రముఖ దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి కాంబినేషన్‌లో రాబోతున్న భారీ పాన్-వరల్డ్ ప్రాజెక్ట్ 'వారణాసి'పై అభిమానుల్లో అంచనాలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఈ సినిమా అప్‌డేట్‌లను ఫ్యాన్స్ ఆసక్తిగా గమనిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ చిత్రం షూటింగ్‌కు సంబంధించి రాజమౌళి స్వయంగా ఒక కీలక అప్‌డేట్ ఇచ్చారు. మరో నాలుగు నెలల్లో, అంటే ఈ ఏడాది సెప్టెంబర్ లేదా అక్టోబర్ నాటికి చిత్రీకరణ మొత్తం పూర్తి కానుందని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రకటనతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి.

ఫ్రాన్స్‌లో జరిగిన 'ఆన్సీ ఇంటర్నేషనల్ యానిమేషన్ ఫెస్టివల్'లో పాల్గొన్న రాజమౌళి, ఒక అంతర్జాతీయ మీడియా సంస్థతో మాట్లాడుతూ ఈ విషయాలు వెల్లడించారు. సినిమాలోని కీలకమైన యాక్షన్ సన్నివేశాలు, వారణాసిలో జరగాల్సిన ముఖ్యమైన షెడ్యూల్ ఇప్పటికే విజయవంతంగా పూర్తయ్యాయని ఆయన తెలిపారు. ప్రస్తుతం కేవలం కథను ముందుకు నడిపే చిన్న చిన్న సన్నివేశాలను, ప్యాచ్ వర్క్‌ను మాత్రమే చిత్రీకరించాల్సి ఉందని జక్కన్న వివరించారు. ఆయన మాటలతో సినిమా శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్నట్లు స్పష్టమైంది.

ఈ చిత్రాన్ని ఐమాక్స్ ఫార్మాట్‌లో రూపొందించడంపై రాజమౌళి ఆసక్తికరమైన సాంకేతిక వివరాలు పంచుకున్నారు. ఈ కథను ఐమాక్స్ తెరపై చూస్తేనే అసలైన అనుభూతి కలుగుతుందని, అందుకే ఈ ఫార్మాట్‌ను ఎంచుకున్నామని తెలిపారు.

అయితే, ఐమాక్స్ కోసం కథలో మార్పులు చేయలేదని, కేవలం సాంకేతిక సర్దుబాట్లు మాత్రమే చేశామని అన్నారు. సాధారణ సినిమా స్కోప్, ఐమాక్స్ రెండింటికీ అనుకూలంగా ఉండేలా 'అనామార్ఫిక్ ఫ్రేమింగ్' అనే ప్రత్యేక పద్ధతిని ఉపయోగించి చిత్రీకరణ జరుపుతున్నట్లు వివరించారు. ఈ టెక్నిక్‌తో మొదట్లో కొన్ని ఇబ్బందులు ఎదురైనా ఆ తర్వాత పని సులభంగా సాగిందని ఆయన పేర్కొన్నారు.

ప్రపంచవ్యాప్తంగా భారీ అంచనాలతో తెరకెక్కుతున్న ఈ యాక్షన్ అడ్వెంచర్ చిత్రంలో గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా కథానాయికగా నటిస్తున్నారు. 'ఆర్ఆర్ఆర్' తర్వాత రాజమౌళి నుంచి వస్తున్న ఈ ప్రాజెక్ట్‌ను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని 2027 ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. రాజమౌళి తాజా ప్రకటనతో సినిమా విడుదల తేదీపై కూడా స్పష్టత వచ్చినట్లయింది.

# టాలీవుడ్‌లో అదృష్టాన్ని పరీక్షించుకోనున్న 'వందేమాతరం' తనయుడు



**విశ్వంభర, సినిమా:** టాలీవుడ్‌లో వారసుల రాక కొత్తేమీ కాదు. ఇప్పటికే ఎంతో మంది స్టార్లు, టెక్నీషియన్ల పిల్లలు ఇండస్ట్రీలో తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఇప్పుడు ఈ జాబితాలోకి మరో యువకుడు చేరాడు. ప్రముఖ సంగీత దర్శకుడు వందేమాతరం శ్రీనివాస్ కుమారుడు సుస్వర తరంగ్ హీరోగా వెండితెరకు పరిచయం కాబోతున్నాడు. సుస్వర తరంగ్ హీరోగా వీరేష్ కోకా దర్శకత్వంలో ఓ రొమాంటిక్ థ్రిల్లర్ తెరకెక్కుతోంది. సురవి విజన్స్ బ్యానర్‌పై పి. చక్రధర రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా శుక్రవారం పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి పలువురు సినీ ప్రముఖులు హాజరయ్యారు. ముహూర్తపు సన్నివేశానికి ప్రముఖ దర్శకుడు డాలీ క్లాప్ కొట్టగా, గంటా రవితేజ (టీడీపీ నేత గంటా శ్రీనివాసరావు కుమారుడు) కెమెరా స్విచ్ ఆన్ చేశారు. ప్రముఖ నిర్మాత నల్లమలుపు బుజ్జి చిత్రబృందానికి స్క్రిప్ట్ అందజేశారు. ఈ చిత్రంలో సుస్వర తరంగ్ సరసన దివ్యాని మొండల్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఎస్. చంద్రశేఖరన్ సినిమాటోగ్రాఫర్‌గా, బిబిన్ అశోక్ సంగీత దర్శకుడిగా, నిరంజన్ దేవరమానే ఎడిటర్‌గా వ్యవహరించనున్నారు. ఈ నెల 29 నుంచి సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుందని చిత్ర యూనిట్ వెల్లడించింది. తండ్రిలాగే తనయుడు కూడా ఇండస్ట్రీలో మంచి పేరు తెచ్చుకుంటాడో లేదో చూడాలి.

# చాపెల్‌ను ఇంకా క్షమించని గంగూలీ!

**విశ్వంభర, స్పోర్ట్స్ :** భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ, మాజీ కోచ్ గ్రెగ్ చాపెల్‌తో గతంలో ఉన్న విభేదాలపై మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశాడు. దాదాపు రెండు దశాబ్దాల క్రితం వారిద్దరి మధ్య తలెత్తిన వివాదం తర్వాత కూడా చాపెల్ తనను రెండుసార్లు సంప్రదించాడని, అయితే తాను స్పందించలేదని గంగూలీ వెల్లడించాడు. "నేను ఒకసారి మూర్ఖుడిని కావచ్చు, కానీ రెండోసారి కాదు" అని వ్యాఖ్యానించాడు. ఇటీవల ఓ స్పోర్ట్స్ జర్నలిస్టుతో నిర్వహించిన పాడ్‌కాస్ట్‌లో గంగూలీ మాట్లాడుతూ, ఈ ఏడాది ఆరంభంలో, జైలులో ఉన్న పాకిస్థాన్ మాజీ ప్రధానమంత్రి ఇమ్రాన్ ఖాన్‌కు మద్దతుగా ఒక పిటిషన్‌పై సంతకం చేయాలని చాపెల్ తనను కోరాడని, అయితే తాను దానికి స్పందించలేదని చెప్పాడు. అలాగే 2011లో తాను ఐపీఎల్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) కెప్టెన్‌గా ఉన్న సమయంలో, ఆ జట్టుకు తాను కోచ్‌గా వస్తానని చాపెల్ ఈమెయిల్ పంపాడని గంగూలీ గుర్తుచేసుకున్నారు. ఆ ప్రతిపాదన చూసి ఆశ్చర్యపోయానని, కానీ దానిని ఏమాత్రం పట్టించుకోలేదని స్పష్టం చేశారు. భారత క్రికెట్ చరిత్రలో గంగూలీ-చాపెల్ వివాదం ఒక వివాదాస్పద ఘట్టం. 2005లో గంగూలీ సిఫార్సుతోనే చాపెల్ భారత జట్టు ప్రధాన కోచ్‌గా నియమితుడయ్యాడు. అయితే కొద్ది కాలంలోనే వారి మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. గంగూలీని కెప్టెన్సీ నుంచి తప్పించాలని చాపెల్ బీసీసీఐకి లేఖ రాసినట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి. ఆ తర్వాత గంగూలీ జట్టులో స్థానం కోల్పోయినప్పటికీ అద్భుతంగా పునరాగమనం చేశాడు. 2007 వన్డే ప్రపంచకప్‌లో భారత్ జట్టు వైఫల్యం తర్వాత చాపెల్ తన పదవి నుంచి తప్పుకున్నాడు.



# స్వదేశంలో భారత్‌ను చిత్తు చేసిన ఐర్లాండ్..!

**విశ్వంభర, స్పోర్ట్స్ :** సంచలనాలకు నెలవైన టీ20ల్లో పెద్ద జట్టైన భారత్‌కు ఐర్లాండ్ ఊహించని షాకిచ్చింది. రెండు మ్యాచ్‌ల సిరీస్ తొలి పోరులో టీమిండియాను 34 పరుగుల తేడాతో ఓడించింది. 183 పరుగుల ఛేదనలో హిట్టర్లతో నిండిన భారత జట్టు అలవోకగా గెలుస్తుందనుకుంటే.. ఐరిష్ బౌలర్లు గొప్పగా కట్టడి చేశారు. మాథ్యూ హెూలార్డ్(3-28)తో మిడిలార్డర్‌ను దెబ్బతీయగా.. అభిషేక్ శర్మ(50),శివం దూబే(25) కాసేప పోరాడాడు. ఫలితంగా సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది ఆతిథ్య జట్టు. టీ20 వరల్డ్‌కప్‌ను మూడుసార్లు ముద్దాడిన భారత్‌ను చిన్న జట్టైన ఐర్లాండ్ ఓడించింది. స్వదేశంలో బ్యాటుతో, బంతితో, ఫీల్డింగ్‌లోనూ అద్భుతంగా రాణించిన ఐరిష్ టీమ్ సంచలన విజయంతో టీమిండియాకు షాకిచ్చింది. తొలుత ఆడిన ఐర్లాండ్. 183 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. రికార్డు వీరులైన భారత బ్యాటర్ల ముందు ఈ లక్ష్యం ఏం నిలుస్తుంది అనుకున్న వారి అంచనాలు తప్పని ఐర్లాండ్ నిరూపించింది.

పొట్టి వరల్డ్‌కప్‌లో ఇరగదీసిన ఓపెనర్ సంజూ శాంసన్(5) బంతిని వికెట్ల మీదకు ఆడుకోగా.. ఇషాన్ కిషన్(1).. శ్రేయస్ అయ్యర్(3) ఇలా వచ్చి అలా వెళ్లారు. ఐరిష్ బౌలర్లు ఒత్తిడి పెంచే ప్రయత్నాన్ని అభిషేక్ శర్మ(50) అర్ధ శతకంతో నీరుగార్చాడు. కానీ బౌన్సర్లు, షార్ట్ పిచ్ బంతులతో టీమిండియా హిట్లర్లకు కళ్లెం వేశారు. సుందర్(9), తిలక్ వర్మ(19) సైతం నిలబడలేదు.

చూస్తుండగానే ఐదు వికెట్లు పడడంతో శివం దూబే(25), అక్షర్ పటేల్(15) గెలిపించే ప్రయత్నం చేశారు. ఏడో వికెట్‌కు 35 రన్స్ చేసిన దూబేను మూంబ్రా రిటర్న్ క్యాచ్‌తో వెనక్కి పంపాడు. డెలానీ ఓవర్లో సిక్సర్ కొట్టే క్రమంలో టెక్టర్ చేతికి చిక్కాడు అక్షర్. దాంతో.. టీమిండియా ఓటమి ఖాయమైంది. సిక్సర్‌తో ఆశలు రేపిన హర్షిత్ రానా(8) బౌండరీ వద్ద దొరికగా.. 19వ ఓవర్ చివరి బంతికి అర్ష్‌దీప్ సైతం ఔటయ్యాడు. భారత్ 148కే ఆలౌటవ్వగా.. 34 రన్స్ తేడాతో ఐర్లాండ్ గెలుపొందింది.

ఆదుకున్న టక్నర్, గెలానీ

భారత బౌలర్లు పంజా విసిరినా ఐర్లాండ్ భారీ స్కోర్ కొట్టింది. టాస్ ఓడిన జట్టుకు శుభారంభమివ్వాలనుకున్న ఓపెనర్ రాస్ అడైర్(12)ను ఔట్ చేసి హర్షిత్ రానా(3-24) తొలి వికెట్ అందివ్వగా.. హ్యారీ టెక్టర్(0)ను అర్ష్‌దీప్ సింగ్(2-28) పెవిలియన్ పంపాడు. తర్వాతి ఓవర్లో టిమ్ టెక్టర్(17)ను రానా డగౌట్ చేర్చగా 30 పరుగులకే మూడు వికెట్లు పడ్డాయి. ఆ దశలో ఆచితూచి ఆడాలనుకున్న బెంజమిన్ కాలిట్జ్(15)ను దూబే బోల్తా కొట్టించాడు. కష్టాల్లో పడిన జట్టును కెప్టెన్ లొర్కాన్ టక్నర్(50), గరెత్ డెలానీ(49)లు ఆదుకున్నారు.

వరుసగా నాలుగు వికెట్లు పడిన దశలో టక్నర్, డెలానీ నిలబడ్డారు. మరో వికెట్ పడకుండా.. రన్‌రేటు తగ్గకుండా స్కోర్ బోర్డును నడిపించారిద్దరూ. దూబే ఓవర్లో ఫోర్, డబుల్స్‌లో ఐరిష్ సారథి అర్ధ శతకం సాధించాడు. కానీ హర్షిత్ ఓవర్లో టక్నర్.. తిలక్ వర్మ చేతికి చిక్కడంతో 115 వద్ద ఐదో వికెట్ పడింది. డెత్ ఓవర్లలో గేర్ మార్చిన గెలానీ బౌండరీలు రాబట్టగా.. ఐర్లాండ్ నిర్ణీత ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 182 పరుగులు చేయగలిగింది.






# నాకౌట్‌లో ఈక్వెడార్.. దేశమంతా సెలవు ప్రకటించిన అధ్యక్షుడు..!

**విశ్వంభర, స్పోర్ట్స్ :** ఫిఫా వరల్డ్‌కప్‌లో లీగ్ దశ దాటడమే గగనం. అలాంటిది నాలుగుసార్లు ఛాంపియన్‌ను ఓడించి నాకౌట్‌కు దూసుకెళ్తే ఆ కిక్కే వేరబ్బా. ఇప్పుడు ఈక్వెడార్(జుఎఖ్ఖుఎశీతీ) జట్టు.. ఆ దేశ ప్రజలు అదే కిక్కులో మునిగితేలుతున్నారు. జర్మనీకి షాకిచ్చిన ఈక్వెడార్ నాకౌట్ బెర్తు పట్టేయడం ఆ దేశాన్ని సంబురాల్లో ముంచెత్తింది. తమ జట్టు అద్భుతం చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేసిన అధ్యక్షుడు డానియెల్ నొబోవా అజిన్ శుక్రవారం దేశమంతా సెలవు దినం ప్రకటించారు. ఆటగాళ్లు, కోచ్‌ను అభినందించిన ఆయన.. తమ జట్టు విజయాన్ని అభిమానులు సెలబ్రేట్ చేసుకోవడానికి వీలుగా హాలి డే డిక్లేర్ చేశారు. సాకర్ వరల్డ్‌కప్‌లో నాకౌట్‌లో అడుగుపెట్టడం చిన్న విషయమేమీ కాదు. మేటి జట్లను ఓడిస్తేగానీ లీగ్ దశ దాటడం సాధ్యమవ్వదు. ఫిఫా వరల్డ్‌కప్‌లో మెరుగైన ప్రదర్శన చేసే ఈక్వెడార్ ఈసారి అతిపెద్ద సంచలనం నమోదు చేసింది. గతంలో నాలుగుసార్లు ఛాంపియన్ జర్మనీపై 2-1తో జయభేరి మోగించి నాకౌట్ బెర్తు సాధించింది. దాంతో, ఈక్వెడార్ అధ్యక్షుడు డానియెల్ నొబోవా అజిన్ ఆనందం పట్టలేకపోయారు. తమ జట్టు విజయాన్ని కీర్తించిన ఆయన.. దేశమంతా సెలవు ప్రకటించారు. 'ఈక్వెడార్ ఆటగాళ్లు, కోచ్‌కు ధన్యవాదాలు. విమర్శలు, అవమానాలు, కఠిన పరిస్థితులు ఎదురైనప్పటికీ మీరు గొప్పగా రాణించి దేశాన్ని సంబురాల్లో ముంచెత్తారు. రేపు శుక్రవారం దేశమంతా సెలవు ప్రకటిస్తున్నా. ఈక్వెడార్ జిందాబాద్' అని ఎక్స్ పోస్ట్‌లో డానియల్ పేర్కొన్నారు.

**రెండో అర్ధ భాగంలో** కెనడా, మెక్సికో, అమెరికా సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న ఫిఫా వరల్డ్‌కప్‌ను గ్రూప్ ఈలోని ఈక్వెడార్ ఓటమితో ఆరంభించింది. తొలి పోరులో ఐవరీకోస్ట్ చేతిలో 0-1తో ఓడిన ఆ జట్టు.. కురకావోతో రెండో మ్యాచ్‌ను డ్రా చేసుకుంది. చావోరేవో పోరులో గురువారం జర్మనీపై ఈక్వెడార్ ఆటగాళ్లు గొప్ప ప్రదర్శన చేశారు. తొలుత జర్మనీ ఆటగాడు సేన్ రెండో నిమిషంలోనే గోల్ చేసి ఆధిక్యాన్ని అందించాడు. కాసేపటికే ఈక్వెడార్ ప్లేయర్ నీల్సన్ అంగులో 9వ నిమిషంలో గోల్ చేయగా స్కోర్ సమం అయింది. రెండో అర్ధ భాగంలో పెనాల్టీ లభించినా జర్మనీ సద్వినియోగం చేసుకోలేకపోయింది. 77వ నిమిషంలో ఈక్వెడార్ ఆటగాడు గొంజాలెజ్ ప్లాటా గోల్‌తో 2-1తో అదిరే విజయాన్ని అందించాడు.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana. EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com